ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
మే 17, 2015

సర్వం దర్శనం

వసి వాడని
సరోజం



పెళ్లా...అప్పుడేనా!

సినీ స్టార్లు కనిపిస్తే చాలు... ఒక ప్రశ్న తప్పక అడుగుతుంటారు. 'పెళ్లెప్పుడు?' అని. తారలు చెప్పడానికి ఇష్టపడని, దాటవేయడానికి ప్రయత్నించే వాటిల్లో ఇదీ ఒకటి. అలా వేసిన ఆసక్తికరమైన ఆ ప్రశ్నకు కథానాయికలు ఇచ్చిన గడుసు సమాధానాలు....

ఆదా శర్మ

పెళ్లి ఎప్పుడు చేసుకుంటావు ఆదా? అనడిగిన మీడియా వాళ్లకు ప్రశ్నతోనే సమాధానమిస్తోందీ తార. "పెళ్లయ్యాక నిజంగా సంతోషంగా వున్న ఒక్క జంటను చూపిస్తే నేను పెళ్లి చేసుకుంటాను" అని. అంటే... ఇకమీదట ప్రశ్నలు వేయడం మానేసి 'సంతోషంగా వున్న జంట' కోసం వెతుకులాట మొదలెట్టాలేమో!

రెజీనా

ముక్కూమొహం తెలియని వారు కూడా పెళ్లెప్పుడు అని అడిగే ప్రశ్నలకు రెజీనా తల్లి గట్టి సమాధానమే ఇచ్చింది. 'పెళ్లి కంటే ముందు మా అమ్మాయి చాలా దూరం ప్రయాణించాలి' అని. దానికి రెజీనా 'కెరీర్ విషయంలో అమ్మ నన్ను ఎంతగానో ప్రోత్సహిస్తుంది. అంతేకాదు. స్వతంత్రంగా, నా కాళ్ల మీద నేను నిలబడ్డాక పెళ్లి గురించి ఆలోచించమంటుంది" అని చెప్తోంది గడుసుగా.

అనుష్క

టాలీవుడ్‌లో అనుష్క పెళ్లి గురించిన వార్తలు, కథనాలు ఎప్పుడూ వస్తూనే వుంటాయి. 'కళ్యాణ ఘడియలు ప్లాన్ ప్రకారం రావు. సరైన సమయం వచ్చినప్పుడు ... అమ్మానాన్నలు చూసిన అబ్బాయిని పెళ్లాడతాను. ఒకవేళ నేను ఎవరినైనా ప్రేమిస్తే... వాళ్లకతని గురించి చెప్పి వివాహం చేసుకుంటాను' అంటోంది అనుష్క. మరి ఆ ఘడియ ఎప్పుడొస్తుందో!

సమంత

"త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారటగా?" అనడిగారెవరో. 'నిజమా! ఇంతకీ నేను పెళ్లి చేసుకోబోయే వ్యక్తి ఎవరు? ప్లీజ్! కొంచెం అతని ఫోన్ నెంబరివ్వండి. అలాగైనా నాకు కొంత టైమ్ మిగులుతుంది' అన్నాను. నిజానికి ప్రేమించే మూడ్ లేదు నాకు. చాలా కాలం వరకు పెళ్లి చేసుకోవాలన్న ఆలోచన కూడా లేదు" అంటోంది జెర్సీ బేబీ.

శృతి హాసన్

"మా అమ్మానాన్నా, స్నేహితులు మినహా ప్రతి ఒక్కరూ ... నేను పెళ్లి చేసుకుంటే చూడాలన్న ఆతృతతో వున్నారు. ఈ మధ్యే 'సింగిల్‌గా వున్నారా?' అనడిగారెవరో. అవునన్నాను. వాళ్లు నమ్మలేదనుకోండి. అలా మొదలైన మా సంభాషణ... 'ఎలాంటి అబ్బాయిని పెళ్లాడతారు?' వరకు వచ్చింది. 'ఇహ ఇక్కడితో ఈ మాటలకు బ్రేక్ వేస్తే మంచిది. నా పెళ్లి గురించి జనంలో లేనిపోని ఉత్సుకత రేకెత్తించడం నాకిష్టం లేదు" అన్నానంటోంది శృతి. కత్తి లాంటి జవాబు కదా.

కాజల్ అగర్వాల్

"మా చెల్లెలు పెళ్లయిన దగ్గర్నుంచి... ఇప్పటికి నన్ను ఎంతమంది ఈ ప్రశ్న అడిగి వుంటారో మీకు తెలీదు. ప్రస్తుతానికి నా దృష్టి అంతా పని మీదే. ఇదిగో అప్పుడే పెళ్లాడాలి అన్న నిబంధనేమీ పెట్టుకోలా. సమయం వచ్చినప్పుడు... తప్పకుండా చేసుకుంటాను. ముందుగా సీనియర్ల పెళ్లిళ్లు కావాలి కదా. ఆ తర్వాతే నేను" అంటోంది చిలిపిగా. అంటే ఇంకా చాలా టైమ్ వుందన్నమాట.

స్నేహ ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

ఊరించే ఊరట

తమిళ తంబీలకు అమ్మ, పురుచ్చితలైవి. రాష్ట్రాధినేత్రి (ఒకప్పటి). ఆమె చెప్పిందే వేదం. చేసిందే శాసనం. 'స్థాన' బలిమి కలిగిన ఆ స్థాయి నేత ఆదాయానికి మించిన ఆస్తులను పోగేసుకోకపోతే వింత. ఇక్కడా వింతకు ఆస్కారం ఇవ్వలేదు అమ్మగారు. అందుకే అమ్మను కోర్టులు... కేసులు.. వాయిదాలు... జరిమానాలు... శిక్షలు.. అన్నీ వరుసగా వరించాయి. చట్టం చేతులు చాలా పొడవన్న విషయం ఆలస్యంగానైనా మరో మారు రుజువైనందుకు ప్రజాస్వామికవాదులు సంతోషించారు. అప్పటివరకు అపరిమితమైన అధికారంతో ఎదురులేదని విర్రవీగిన అమ్మ ... ఈ కేసుతో ఊపిరాడక గిలగిలలాడింది. గద్దెకు దూరమై విలవిలలాడింది. అక్రమార్జన కేసు నుంచి ఎప్పుడెప్పుడు ఊరట లభిస్తుందా! అని నిలువెల్లా కనులు చేసుకుని ఎదురు చూసింది.

● ● ● ● ●

ఖాన్ త్రయంలో ఒకడిగా నిత్యం న్యూస్‌లో వుండడం సల్లూ భాయ్ స్పెషల్. ఖాన్ నడిస్తే మాస్. స్టెప్పేస్తే మాస్. చెయ్యి మడిస్తే మాస్. ఏం చేసినా హీరోయిజమనుకునే రేంజ్‌కెళ్లిపోయాడు. తాగి బండి నడిపి ఒకరి ప్రాణం హరీమనిపించాక...అడవిలో వన్యప్రాణులను వేటాడాక...అతను తెర మీద మాత్రమే హీరో అని...బయట విలనని నిరూపితమైంది. సినీ సెట్లపై హీరోయిన్లతో స్టెప్పులేస్తూ చెట్ల చుట్టూ తిరగాల్సిన హీరోగారు కేసుల్లో ఇరుక్కుని... కోర్టుల చుట్టూ పరిభ్రమించాల్సి వచ్చింది. ఎట్టకేలకు శిక్ష ఖరారవడంతో.... ఎంత పెద్ద హీరోలైనా తప్పు చేస్తే... చూస్తూ ఊరుకోదని... చట్టం తన పని తాను చేసుకుపోతుందని సామాన్యులు సైతం నమ్మారు. హీరోగారు మాత్రం... ప్రాణం తీసి పరారైన కేసు నుంచి ఎలా బైట పడతానా...ఎప్పుడెప్పుడు ఊరట లభిస్తుందా! అని ఎదురు చూశారు.

◆ మనలో మాట

● ● ● ● ●

నిజానికి అమ్మగారు, హీరోగారు వంటరులు కారు. సత్యం రామలింగరాజు లాంటి ఎందరో ఆర్థిక, రాజకీయ నేరగాళ్లు వీరికి తోడున్నారు. ఎప్పుడెప్పుడు కేసుల నుంచి ఊరట పొందుతామా అని ... తపించారు. జపించారు. చివరికి సాధించారు. ఈ ఎపిసోడ్ అంతటిలో కోర్టుల పాత్ర మాత్రమే కనిపిస్తున్నా... కంటికి కనిపించని ... అధికారిక ... సామాజిక... ఆర్థిక కారణాలెన్నో.

ఇవేవీ అర్థం చేసుకోలేని సామాన్యుడు ... దైనందిన సమస్యల నుంచి ఊరట పొందేందుకు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నాడు. మరి అమ్మకు, ఖాన్‌కు, సత్యం రాజుకు ఊరటనిచ్చిన మహానుభావులు కామన్‌మేన్ విషయంలో ఎందుకు కలగ చేసుకోరనేదే అంతుపట్టదు. ∎



సావిత్రికి జోహార్లు

సావిత్రి సువర్ణాధ్యాయం చదువుతుంటే కన్నీళ్లు వచ్చాయి. కథ చాలా బాగుంది. మన్యం వీరుడు సీతారామరాజు గురించి తెలియని విషయాలు చాలా నేర్చుకున్నాను. టెకీ రైతుల గురించి చాలా తెలుసుకున్నాను. నేడు వ్యవసాయం ఎంత దుర్భిక్ష పరిస్థితుల్లో ఉందో మనం చూస్తున్నాం. అలాంటిది మన కుర్రోళ్ల లక్షల జీతాలు వదులుకొని వ్యవసాయం చేయడం చాలా ఆనందంగా ఉంది.

నాగరాజు, తిరుపతి (ఈమెయిల్)

ధ్రువతార

ఆదివారం స్నేహలో వచ్చిన సావిత్రి వ్యాసం చాలా బాగుంది. నీవు లేక వీణ పలక లేనన్నది మొదలగు పాటలు విన్నప్పుడు వెంటనే గుర్తు వచ్చేది సావిత్రి. తన ముగింపు జీవితం గురించి ఈ పుస్తకంలో తెలుసుకున్నాను. సావిత్రికి జోహార్లు. ఒక ధ్రువతార నింగికెగిసింది.

రమణా రెడ్డి, విశాఖపట్నం (ఈమెయిల్)

కట్...కట్...

ఈ వారం 'నవ్వుల్-పువ్వుల్' చాలా బాగున్నాయి. రంగుల్లో ఇచ్చిన 'బుల్లి బకాసురులు' గురించి చదివాం. ఆకట్టుకుంది. ఇలాంటి వ్యాధితో బాధపడే వారికి ప్రభుత్వమే సాయం అందించాలి. ఎవరి దగ్గర ఎన్ని కత్తెరలున్నా మాస్టర్ కత్తెర ప్రజల చేతిలో ఉందన్న విషయాన్ని మనలో మాట 'కట్ కట్'లో చాలా బాగా చెప్పారు.

సుభాష్, విశాఖపట్నం. (ఈమెయిల్)

పరారైన పెళ్లికూతురికి అభినందనలు

సావిత్రి నటించిన సినిమా చూస్తే సావిత్రి కళ్ళు, నవ్వు, ఆ ముఖ కవళికలు చాలా రోజుల వరకు గుర్తొస్తుంటాయి. అల్లూరి కథ చిన్నప్పుడు పుస్తకాల్లో చదవడమే. కానీ ఆయన మీద వచ్చిన సినిమాలు చాలా వరకు చూశాను. అయితే అందులో అట్టమీది కథలో ఇచ్చినంత వివరంగా విషయం చెప్పలేదు. ఆ కాలంలో విప్లవానికి నాంది పలకడం గొప్ప విషయమే.మనలో మాట 'పరార్' బావుంది. నిజానికి పెళ్లి పీటల మీద నుంచి పారిపోవడం చరిత్రతో గుర్తిండిపోయే సంఘటన. దేశం మొత్తం మీద చర్చనీయాంశం చేయదగిన విషయమది. ఏదేమైనా ప్రతి ఇంటికి మరుగుదొడ్డి చాలా అవసరం. ప్రచారం కన్నా పని మిన్న. పరారై మరుగుదొడ్డి సంపాదించుకున్న అమ్మాయిని మెచ్చుకోవాల్సిందే.

కనకలక్ష్మి, ఆముదాలవలస.

చెక్

ఈనాడు ప్రభుత్వం అవలంబిస్తున్న మద్యం పాలసీ చాలా కుటుంబాలను నాశనం చేస్తోంది. మద్యానికి బానిసలైన వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఏది ఏమైనప్పటికి చెస్ ఆటతో మద్యం మహమ్మారి నుండి బయటపడి ఆదర్శంగా నిలిచిన కేరళ గ్రామ ప్రజల నుంచి నేర్చుకోవాల్సింది ఎంతైనా వుంది.

ఎస్. సుమన్, ఒంగోలు.

విశ్వాస యాత్ర

అమెజాన్ రేస్‌లో జరిగే ట్రెక్కింగ్‌లో ఓ కుక్క కూడా పాలుపంచుకోవడం చదివి సంతోషించాం. ఇలా కుక్క తన విశ్వాసాన్ని మరోసారి నిరూపించింది.

సరిత, విజయవాడ.

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 21/1, ఆజామాబాద్, హైదరాబాద్-500020.

మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

ఈ సంచికలో....

సర్వం దర్శనం

కవర్‌స్టోరీ 14

కదలకుండానే అనంత కాల ప్రయాణాల్లోకి లాక్కెళుతుంది. ముట్టుకోకుండానే అతీత లోకాల్లోకి ఎత్తుకుపోతుంది.. మ్యూజియం. కాదేది కవితకు అనర్హ మన్నట్టు మ్యూజియానికి కూడా వస్తువు నిమిత్తం లేదు. పరిశోధకుల చారిత్రక శిల్పం నుంచి చిన్నారుల ఆట బొమ్మల వరకు, ఆది మానవుల రాతి బాకు నుంచి ఆధునిక మనిషి యుద్ధట్యాంకు వరకు, కళాపిపాసుల మోనాలిసా నుంచి బానిస జీవుల మృత్యు కుహరాల వరకు ప్రతిదీ ప్రదర్శన వస్తువే. మనిషి, ప్రకృతి, భూమిల భిన్నాంశాలను స్పృశిస్తూ పాఠం చెప్పే మ్యూజియమే మానవుడికి నిజమైన ఆరాధనాలయం.

తెగువ 3
మద్యం సేవించారని మనువు వద్దన్నారు

నవ్వుల్-పువ్వుల్ 4

వింతలోకం 5
పిలుపు భలే రుచి

స్ఫూర్తి 6
నవ యువ గ్రహాలు

ప్రత్యేకం 8
జీ(వి)తమంతా సేవకే...

పోరు 9
'మంత్రాల' జబ్బుకు వైద్యురాలు

ప్రకృతి 10
చెట్ల రామయ్య

రుచి 11
దోసకాయ పచ్చడి

కథ 18
రేపటి బీడు

బాలనేస్తాలు 22
మొత్తం ఎందరు?

కొత్త పుస్తకాలు 24
వ్యాధులపై శాస్త్రీయ అవగాహన కల్పించే కథలు

వసి వాడని సరోజం
............12

పెళ్లంటే నూరేళ్ల పంట. పంట సమృద్ధిగా వుండాలంటే ... భార్యాభర్తల మధ్య అన్యోన్యానురాగాలు అనంతంగా వుండాలి. అవి లోపించినప్పుడు... మసకబారినప్పుడు పంట కూడా పల్చబడుతుంది. దంపతుల్లో ఎవరు వ్యసనాలకు లోనైనా సంసార సేద్యం ఒట్టిపోతుంది. అలా కాకూడదని భావించిన ముగ్గురు గ్రామీణ యువతులు తెగువ చూపించారు. మద్యం మత్తులో జోగుతూ వివాహ వేదికనెక్కిన వరుళ్లను ఛీకొట్టారు.

పెళ్లినే రద్దు చేసేశారు.

తెగువ

మద్యం సేవించారని మనువు వద్దన్నారు

మన చుట్టూ జరుగుతున్న ఎన్నో విషయాలు... మీడియాలో వార్తలు, కథనాల రూపంలో వస్తుంటాయి. అధికశాతం కథనాలు అత్యాచారాలు, గృహ హింస, కుల దురహంకార హత్యలు...చుట్టూనే పరిభ్రమిస్తుంటాయి. అయితే ఇటీవల ముగ్గురు గ్రామీణ యువతులు చేసిన సాహసం...తీసుకున్న నిర్ణయం పత్రికలను, వార్తా చానళ్లను ఆకట్టుకుంది.

మగువ తెగువ

ఉత్తరప్రదేశ్‌లోని మహోబా జిల్లాలో ఓ కుగ్రామం అజ్నర్. మామూలుగా ఆ పల్లెటూరి గురించి మీడియాకు పట్టేదే కాదు. నేహ పెళ్లితో పత్రికలు, చానళ్ల దృష్టి ఒక్కసారిగా ఆ గ్రామం మీద పడింది. హుటాహుటిన అక్కడకు చేరుకుని జరిగిన కథను ప్రపంచం ముందుంచాయి. శ్రీపత్ అహిర్వార్ ముద్దుల తనయ నేహ. వున్నంతలో గొప్పగా కూతురు పెళ్లి చేయాలనుకున్నాడాయన. కుటుంబ నేపథ్యం, ఆదాయ వనరులు, చదువు సంధ్యలు ... వగైరా వగైరా వివరాలను సేకరించాక... ఒకటికి పదిసార్లు అంచనా వేసుకున్నాక... నేహ వివాహం అరవింద్‌తో ఖాయం చేశారు. పెళ్లి రోజు రానే వచ్చింది. బంధుమిత్రులు... విందు వినోదాలతో... వధువు గృహం వెలిగిపోతోంది. సరిగ్గా అప్పుడు ఊహించని ఘటన చోటు చేసుకుంది. వధువు ఇంటికి విచ్చేసిన అరవింద్ మద్యం మత్తులో జోగుతున్నాడు. పైగా మిత్రబృందంతో కలిసి... నేహ సోదరులతో కొట్లాటకు దిగడమే కాక... అమ్మాయి తరపు బంధువులను నోటికొచ్చినట్టు మాట్లాడసాగాడు. వివాహ క్రతువు నిర్వహిస్తున్న పంతులుగారికి ఇబ్బందిగా వుందని పాటలు ఆపివేయించడమే అందుకు కారణం. ఇది గమనించిన నేహ ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా... తాగి తిక్కతిక్కగా ప్రవర్తిస్తున్న అరవింద్‌ను పెళ్లి చేసుకోనని బంధువుల ముందు తెగేసి చెప్పింది నేహ. తండ్రి కూడా కుమార్తెకు అండగా నిలవడంతో జీవితాంతం ఓ తాగుబోతుతో గడపాల్సిన అగత్యం లేకుండా పోయిందామెకు.

ఆకట్టుకున్న ఆమె నిర్ణయం

పునేశ్వరి సాహస గాథ కూడా అలాంటిదే. ఈమె చత్తీస్‌గఢ్‌లోని మేధ గ్రామస్తురాలు. అన్నీ అనుకున్నట్టుగా జరిగితే ఆమెకు దీపక్ యాదవ్‌తో వివాహం జరిగిపోయేది. వరుడికున్న ఒకానొక బలహీనత అందుకు ఆటంకంగా నిల్చింది. పెళ్లికుమారుడు దీపక్ తన వారితో కలిసి పెళ్లికుమార్తె పునేశ్వరి గ్రామం చేరుకున్నాడు. వివాహ క్రతువు మొదలు కాక ముందే అతను బాగా మద్యం సేవించి వుండడాన్ని ఆమె గమనించి తట్టుకోలేకపోయింది. తాగుబోతు మొగుడితో జీవితాంతం కాపురం చేయలేననుకున్న పునేశ్వరి అతనిని పెళ్లి చేసుకోనని తెగేసి చెప్పేసింది. ఆ నిర్ణయాన్ని మార్చుకోమని...పెళ్లికి ఒప్పుకోమని.. .అబ్బాయి తరపు వారు ఎంతగానో బతిమాలారు. ఆమె మాత్రం ఆ నిర్ణయానికే కట్టుబడి వుంది. గ్రామం యావత్తూ ఆమెకు అండగా నిలబడింది.

మూల్యం చెల్లించుకున్న వ్యసనం

చుట్టూ పాటలు, డాన్సులు. ఆనందం తాండవమాడుతోంది. నవ వరుడు ధన్ను కుమార్ ఊరేగింపుగా వధువు ఇంటికి బయల్దేరాడు. అయితే మద్యం మత్తులో వున్న అతను ఊహించి వుండడు. తనకున్న వ్యసనం వివాహానికి ఆటంకమౌతుందని. పెళ్లి ఆగిపోయిన అవమానభారంతో వెనుదిరగాల్సి వస్తుందని. వివాహ వేడుకకు ధన్ను కుమార్ తాగి తూలుతూ రావడమే కాక...బంధువులను దుర్భాషలాడడం చూసి వధువు రేణు కుమారి తట్టుకోలేకపోయింది.

ఒక వ్యసనపరుడిని పెళ్లి చేసుకోవడానికి తాను సిద్ధంగా లేనని ప్రకటించడమే కాక... తాగి గొడవ చేస్తున్న ధన్ను, అతని మిత్రబృందం మీద పోలీసు కేసు పెట్టింది. సొంత పెళ్లిలో అనుచితంగా ప్రవర్తించినందుకు అతగాడికి... పోలీసులు బాగానే బుద్ధి చెప్పారు. తీసుకెళ్లి జైల్లో పడేశారు. ఈ ఘటన బీహార్‌లోని నవరతన్ పూర్ గ్రామంలో జరిగింది.

ఇవి ఎక్కడో మారు మూల గ్రామాల్లో జరిగిన చెదురు మొదురు ఘటనలే కావొచ్చు. అయితేనేం! పెద్దగా చదువుకోని పల్లె పడుచులు ... తమ జీవితాల కోసం ... తామే నిలబడిన తీరు ...తెగువతో తీసుకున్న నిర్ణయం ... అబ్బురపరచక మానదు.

✦

నవ్వుల్ – పువ్వుల్

కరెంట్ పోతే!

అమెరికాలో కరెంటు పోతే వాళ్ళు కరెంటాఫీస్‌కు ఫోన్ చేస్తారు.
జపాన్‌లో కరెంటు పోతే వాళ్ళు మొదట ఫ్యూజు చెక్ చేస్తారు.
అదే మన దేశంలో కరెంటు పోతే పక్కింట్లో చెక్ చేస్తాం.
ఓహో అందరింట్లో పోయిందా.. ఐతే ఓకే..

బ్యాలన్స్

చలపతి: హలో... కస్టమర్ కేరా?
కస్టమర్ కేర్: అవును చెప్పండి సార్, నేను మీకెలాగ ఉపయోగపడగలను?
చలపతి: సార్! మా వాడు సిమ్ కార్డు మింగేశాడండీ..
క.కే: అయ్యో! కానీ దానికి నేనేం చేయగలనండి?
చలపతి: ఆ సిమ్‌కార్డులో వంద రూపాయల బ్యాలన్స్ ఉంది.
క.కే: ఐతే నేనేం చేయగలనో చెప్పండి సార్!
చలపతి: ఏం లేదు. వాడు మాట్లాడుతుంటే బ్యాలన్స్ కట్ అవుతుందా?
క.కే: ఆ!!!!!!

ఫ్రిజ్

(ఓ కొంటె కుర్రాడు ఒక తెలియని నెంబరుకు కాల్ చేస్తాడు)
కుర్రోడు: హెల్లో, ఇంట్లో ఫ్రిజ్ ఉందా.
సమాధానం: హ , ఉంది.
కుర్రాడు: నడుస్తుందా.
సమాధానం: హ నడుస్తుంది.
కుర్రోడు: గట్టిగా పట్టుకోండి, లేకపోతే పారిపోతుంది.
(ఫోన్ పెట్టేస్తాడు. కొంతసేపయ్యాక మళ్లీ ఫోన్ చేసి)
కుర్రోడు: హెల్లో, ఇంట్లో ఫ్రిజ్ ఉందా?
సమాధానం: లేదు
కుర్రోడు: ఇందాకే చెప్పా కద పట్టుకోమని. చెబితే వింటే కదా!

టైం వేస్ట్

(ఒక ఫ్యాక్టరీలో ఒక వ్యక్తి ఎలాంటి పని లేకుండా నేల చూపులు చూస్తుంటాడు)
ఫ్యాక్టరీ సిఇఒ: నీ జీతం ఎంత ?
వ్యక్తి: ఆరు వేలు సారు.
సిఇఒ: నేను వర్కర్లకు జీతం ఇచ్చేది పని చెయ్యడానికి. టైం వేస్ట్ చెయ్యడానికి కాదు. ఇదిగో 18,000. మూడు నెలల జీతం. ఇంకెప్పుడు నీ మొహం నాకు చూపించకు.
(ఆ వ్యక్తి డబ్బులు తీసుకొని అక్కడి నుండి వెళ్లిపోతాడు)
సిఇఒ: (మిగతా వర్కర్లతో) ఎవరా వ్యక్తి?
వర్కర్లు: అతను పిజ్జా బాయ్ సార్.

పోలిక

తల్లి: ఏమైందమ్మా ఎందుకంత డల్‌గా ఉన్నావు?
కూతురు: అమ్మా నేను పిచ్చిదానిలా ఉంటానా?
తల్లి: లేదే!
కూతురు: నా ముక్కు చింతపిక్కలా ఉంటుందా?
తల్లి: లేదమ్మా
కూతురు: నేనే ఒదరు కప్పలా ఉంటానా?
తల్లి: లేదే, ఇంతకి ఎవరేమన్నారు నిన్ను?
కూతురు: మరి అందరూ నన్ను మీ అమ్మలా ఉన్నా వంటారెందుకు?
తల్లి: ఆ......

బొమ్మే నా ప్రాణం

అబ్బ! అచ్చు బొమ్మలా ఉందే మీ పాప అని ఆయన్ను అందరూ అభినందిస్తారు. పాపను దగ్గరకొచ్చి పలకరిస్తారు. తీరా చూస్తే ఆ పాప బొమ్మే. మరిదేంటి ఈ బొమ్మను కూతురిలా గారాబం చేస్తున్నాడు, ఊరంతా తిప్పు తున్నాడని తెగ ఆశ్చర్యపోతున్నారు. చైనాకు చెందిన సాంగ్‌బో అచ్చు పదేళ్ల వయసు న్న పాపలా ఉండే ఓ బొమ్మను కన్న కూతురిలా సాకుతున్నాడు. 'చిన్ని సీతాకోక చిలుక' అని అర్థం వచ్చేలా 'జియావో డీ' అని పేరు పెట్టాడు. ఇది చూసి ఎగతాళి చేసేవాళ్లు ఆయన కథ వింటే మద్దతు తెలుపుతారు. వీలుంటే వాళ్లు అలాంటి బొమ్మను కొనుక్కోవాలని అనుకుంటారు. రెండేళ్ల క్రితం బోని తీవ్ర అనారోగ్యం కుంగదీసింది. ప్రతిరోజు తీవ్రమైన తలనొప్పి వచ్చి నిద్ర పట్టేది కాదు. చాలా అవస్థ పడేవాడు. సాధారణ జీవితం కూడా కష్టమైపోవడంతో అతను డిప్రెషన్‌లోకి వెళ్లిపోయాడు. పెళ్లి, పిల్లల ఊసే లేదు. ఒక రోజు ఇంటర్నెట్‌లో ఓ బొమ్మను చూశాడు. అచ్చు చిన్న పాపలా ఉండటంతో ఆయనకు తెగ నచ్చేసింది. లక్ష రూపాయల పైనే ఖర్చు పెట్టి దాన్ని కొనేశాడు. బొమ్మ ఇంటికి వచ్చిన దగ్గరి నుంచి అతడిలో చాలా మార్పు కనిపించింది. డిప్రెషన్ నుంచి బయటపడ్డాడు. ఏదో బంధం పెనువేసుకుపోయింది. ఇక అతడు ఎక్కడికెళ్లినా బొమ్మ పాపను వెంటే సుకుని వెళుతున్నాడు. వారానికో సినిమా కచ్చితంగా చూపిస్తాడు. వారాంతాలొస్తే జియావో డీని రెస్టారెంట్‌లకు, పార్కులకు తిప్పుతున్నాడు.ఆ బొమ్మ కూడా ఏం ఎదురుచెప్పకుండా అన్నీ తెలుసుకుంటు న్నట్టే ఉంది ఫొటోలు చూస్తుంటే.

వింతలోకం

రూబిక్స్ క్యూబుడు

రూబిక్స్ క్యూబ్‌ను చటుక్కున పరిష్కరించేసి పక్కనే పెట్టేస్తే ట్రిక్ చేశారనుకుంటాం. నీళ్లలో నడిచే మేజిక్‌నైనా నిజమని ఇట్టే నమ్మేస్తాం కానీ, క్షణాల్లో రూబిక్స్ క్యూబ్‌ను సరిచేశారంటే మాత్రం నమ్మరు. చాలా మంది క్షణాల్లో ఆ పని చేసి రికార్డుల్ని తిప్పికొడుతున్నారు. ఆ జాతి పక్షే స్టాన్‌ఫర్డ్‌కు చెందిన రవి ఫెర్నాండో. ఇంతకు ముందు క్యూబ్‌ను 7.65 క్షణాల్లో పరిష్కరించేశాడు. క్యూబ్ సమస్యకు నాలుగు ఫార్ములాల్ని చక్కగా ఉపయోగించుకోవచ్చు. దానికి టైం పడు తుంది. కుదురుగా కూర్చుని చేయాలి. కానీ, రవి మాత్రం అలా చేస్తే తన ప్రత్యేకత ఏముందని రకరకాలుగా దాని రంగులు కలపడం మొదలుపెట్టాడు. ఓసారి క్రమాన్ని చూసుకుని కళ్లకు గంతలు కట్టుకుని ఒంటి చేత్తో పరిష్కరిస్తే, ఇంకోసారి పాదాల్ని

ఉపయోగించి సమస్యను చక్కదిద్దేశా డు. వీటన్నిటి కంటే అవాక్కయ్యేలా, మూడు క్యూబ్‌లను జగ్లింగ్ చేస్తూ పరిష్కరిం చాడు. ఒక్కో క్యూబ్‌ని పైకి విసు రుతూ... పట్టుకుంటూ... ఉన్న మధ్య సమయంలో అమరికను చూసి దాన్ని గుర్తుపెట్టుకుని చేతిలోకి రాగానే తిప్పుతూ క్యూబ్‌ల్ని పరిష్కరిం చడం సామాన్య విషయం కాదు. అదీ 6 నిమిషాల్లోపు దీన్ని సాధించడం మాయలానే ఉంది. కావాలంటే యూట్యూబ్‌లో ఈ ఫీట్‌ను మీరూ చూడొచ్చు.

పిలుపు భలే రుచి

ప్రియురాలి పేరు వినిపిస్తే ఏదో తీయటి రుచి తెలుస్తుంది. ఎవరైనా దూరమైతే నోటికి చేదు తగులుతుంది. ఎవరన్నా ఇలా చెబితే నమ్మాల్సిందే. ఎందుకంటే ఇంగ్లండ్‌కు చెందిన జేమ్స్ వాన్నర్‌టన్‌కు శబ్దం రుచిగా ఉంటుంది. సరిగ్గానే విన్నారు, ఏ శబ్దం విన్నా షడ్రుచుల్లో ఏదో ఒకటి నోటికి తగులుతుందట. అతడికి సైనస్తేషియా అనే ఇంద్రియ సమస్య ఉంది. ఈ సమస్యతో ఇబ్బంది పడేవారికి ఒక ఇంద్రియం వల్ల మరో ఇంద్రియ జ్ఞానం తెలుస్తుంది. అంటే ఏదైనా శబ్దం వింటే ఏదైనా రుచో, లేక ఏదైనా వస్తువో తోస్తుంది. ఏదైనా తింటే ఏ సంగీతమో, మాటో వినిపిస్తుంది లేదా మనిషో, వస్తువో గుర్తుకువస్తాయి. అప్పుడప్పుడు మనకు కూడా కొన్ని సందర్భాల్లో ఇలా జరుగుతుంది. ఇంద్రియాల్ని పర్యవేక్షించే మెదడు భాగాలు ఒక దానికొకటి లింకు కలిగి ఉండటం వల్లో, తికమక పడటం వల్లో ఇలా అవుతుంది. కొంత మందికి తలకు దెబ్బ తగిలినా ఈ తరహా పరిస్థితి ఎదురవుతుంది. చిన్నతనంలో కొన్నేళ్లపాటు ఈ తరహా ద్వంద జ్ఞానం ఉన్నా క్రమంగా తగ్గిపోతుంది. పాపం, జేమ్స్‌కు మాత్రం చిన్నప్పటి నుంచే ఈ సమస్యతో సావాసం చేస్తున్నాడు. అమ్మ అనే మాటేమో ఐస్‌క్రీం రుచిలా ఉంటుంది జేమ్స్‌కు. నాన్నంటే మాత్రం వేరుశెనగ పప్పు రుచి తగులుతుంది. చదువుకునే రోజుల్లో ప్రముఖ వ్యక్తి అన్నా బోయిలే పేరు వింటే తీయటి పియర్ డ్రాప్ మిఠాయి రుచి తగులుతుండేది. మిత్రులేమో స్ట్రాబెర్రీ జామ్‌లా తగిలేవారట. రకరకాల వ్యక్తులు, ఘటనలు, వస్తువులకు విభిన్నమైన రుచి తెలియడాన్ని ఆయన చక్కగా వినియోగించుకుని జ్ఞాపక శక్తిని పెంచుకునేవాడు. చదువుల్లో ముందుండేవాడు. చివరకు ఆయన డేట్స్‌ను కూడా రూప లావణ్యం బట్టి కాక ఆమె పేరు శబ్దాన్ని బట్టి ఎంచుకునేవాడు. తన మిత్రులు, బంధువుల పేర్లు ఏవైనా చెడు రుచిని కల్గిస్తే మంచి రుచి ఉన్న పేరు పెట్టి పిలిచేవాడు. సినిమాలు, మార్కెట్ల వంటి వాటికి దూరంగా ఉంటాడు. టీవీ చూడటం కూడా తక్కువే. ఎందుకంటే రకరకాల శబ్దాలు రకరకాల రుచులతో నాలుక అల్లాడిపోతుంది. వాళ్ల అమ్మకు కూడా ఈ సమస్య ఉంది. ఆమెకు వారాల పేర్లు రంగులుగా కనిపిస్తాయి.

స్ఫూర్తి

హంస గ్రహం, ముఖర్జీ గ్రహం, సర్కార్ గ్రహం గురించి విన్నారా! మన దేశ శాస్త్రవేత్తలు కొత్తగా గుర్తించినవేమీ కావు. వివిధ రంగాల్లో అమూల్యమైన సేవల్ని అందించిన వారి పేర్లను మైనర్ గ్రహాలకు పెట్టడం అంతర్జాతీయ ఖగోళ సంస్థ మైనర్ ప్లానెట్ కమిటీ సంప్రదాయం. ఎప్పటికీ గుర్తిండిపోయేలా వారి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేస్తారు. మైనర్ గ్రహాలంటే సూర్యుని చుట్టూ తిరిగే ఆస్టరాయిడ్స్, చిట్టి గ్రహాలు, ట్రోజన్లు, సెంటేరస్‌లు, కూపర్ బెల్ట్‌లో పోగుబడిన గ్రహాల అవశేషాలు, నెప్ట్యూన్ గ్రహ భాగాలు వంటి ఖగోళ వస్తువులు. ఇవి గ్రహాలు కావు, తోకచుక్కలు కావు. చిన్న చిన్న రాళ్ల నుంచి పెద్ద పెద్ద పర్వతాల పరిమాణంలో ఉండే రకరకాల ఖగోళ వస్తువులు. మన దేశం నుంచి కూడా కొందర్ని వాటి పేర్లకు ఎంపిక చేశారు. వారిలో 'నవ' మైనర్ గ్రహాల గురించి క్లుప్తంగా...

'నవ' మైనర్ గ్రహాలు

హంస గ్రహం

హంస పద్మనాభన్ అనే సైన్స్ విద్యార్థిని పేరిట మైనర్ గ్రహం 21575నకు హంస అని పేరు పెట్టారు. అమెరికాలోని ఫెర్గ్యూసన్ కళాశాలలో చదువుతున్నపుడు ఆమె మసాచ్యుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ)లో లింకన్ లాబ్ ఫర్ ది ఇంటర్నేషనల్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఐఎస్ఈ) ఫెయిర్ సందర్భంగా ఓ ప్రదర్శన ఇచ్చింది. అప్పుడామె బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతోంది. భౌతిక శాస్త్రంలో కీలక అంశాలకు సంబంధించిన ఆ ప్రదర్శన సదస్సుకు హాజరైన మేటి శాస్త్రవేత్తలను సైతం ఆకట్టుకుంది. ప్రతిభను గుర్తిస్తూ ఆమె పేరిట హంస గ్రహానికి నామకరణం చేశారు. ఇప్పుడామె పూణె విశ్వవిద్యాలయంలో ఫిజిక్స్‌లో పీజీ పూర్తి చేసి థియొరెటికల్ ఫిజిక్స్‌లో పరిశోధన చేసే ఆలోచనలో ఉంది.

సైనుద్దీన్ గ్రహం

కేరళకు చెందిన జీవ శాస్త్రవేత్త సైనుద్దీన్ పట్టాజీ ఎప్పటి నుంచో అపరిష్కృతంగా ఉన్న ఎర్ర వర్షం కారణాల్ని పరిశోధించారు. శ్రీలంకలో, కేరళలోను కురిసిన ఈ వాన పెద్ద అలజడినే సృష్టించింది. చాలా మంది పరిశోధనలు చేశారు గానీ దాని కారణం అంతుబట్టలేదు. చివరకు సైనుద్దీన్ ఒక రకం సూక్ష్మక్రిముల రసాయన చర్య వల్ల ఈ వర్షం కురిసిందని తేల్చారు. ఆయన పేరిటే ఓ చిట్టి గ్రహం (5178 నెం. సీడీ4)కు పేరు పెట్టారు. సెల్ టవర్ల వల్ల కలిగే ముప్పు, దోమల నివారణ వంటి అంశాలపై కూడా పరిశోధన సాగించారు.

సింఘాల్ గ్రహం

కంప్యూటర్‌లో డాక్యుమెంట్ల ఇండెక్స్‌ను రూపొందించడం కష్టంగా ఉండేది. వివిధ వర్గాలుగా జాబితాను తయారు చేయడానికి సమయం బాగా ఖర్చయ్యేది. దీనికి పరిష్కారంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ)ను ఉపయోగించి వాటి మధ్య సారూప్యతలు, సంబంధాలను తీసుకువచ్చి ఇండెక్స్‌ను తేలిక చేశాడు అక్షత్ సింఘాల్. అతని పేరిట మైనర్ గ్రహం 12599కు సింఘాల్‌గా పేరు పెట్టారు. మైనర్ గ్రహాలైన 8749 బీటిల్స్, 2001 ఐన్‌స్టీన్, 7000 క్యూరీల సరసన ఇది ఉంది. అంతటి ప్రఖ్యాత వ్యక్తుల పేరిట నామకరణం చేసిన గ్రహ సముదాయంలో సింఘాల్‌కు స్థానం కల్పించి గౌరవించారు.

పాఠక్ గ్రహం

అంధుల కోసం కనిపెట్టిన బ్రెయిలీ లిపి చదవడానికి, రాయడానికి విభిన్నంగా ఉంటుంది. బ్రెయిలీలో ఆరు చుక్కల విధానం వల్ల 300 చుక్కల కాంబినేషన్స్‌ను గుర్తించుకుంటేనే అర్థమవుతుంది. చదవడానికి, రాయడానికి వేర్వేరు కాంబినేషన్‌లు ఉంటాయి. దీని వల్ల ఇబ్బంది పడుతున్న తన బంధువు పరిస్థితిని గమనించిన మాధవ్ పాఠక్ బ్రెయిలీ లిపి వ్యవస్థలో మార్పులు చేశాడు. రాయడానికి ఉపయోగించే బ్రెయిలీ స్లేట్‌లో మార్పులు చేయడం ద్వారా ఆ లిపిని అర్థం చేసుకోవడం తేలికైపోయింది. కేవలం తన బంధువుకే కాదు అంధులందరికీ పెద్ద కష్టాన్ని తప్పించిన పాఠక్ సేవను అభినందిస్తూ మైనర్ గ్రహం 12509కు పాఠక్‌గా పేరుపెట్టారు.

వైష్ణవ్ గ్రహం

ఒకప్పుడు మల్టీ లేయర్ ప్లాస్టిక్ రీసైక్లింగ్ చేసేవాళ్లు కాదు. దాన్ని మరో ఉత్పత్తిలోకి వినియోగించడానికి కుదిరేది కాదు. అందువల్ల దానిని పునరుత్పాదనకు సేకరించేవారు కాదు. గుట్టలుగా పేరుకుపోతున్న ఆ తరహా ప్లాస్టిక్ పర్యావరణానికి ఎంతో కీడు చేస్తుందని గమనించిన పదో తరగతి విద్యార్థి హెటల్ వైష్ణవ్ కొత్త రకం ప్లాస్టిక్ పదార్థాన్ని కనుగొంది. వేఫర్లు, ప్యాకేజింగ్‌తో పాటు బలమైన తలుపులు, ఇతర వస్తువుల తయారీలో దానిని వాడొచ్చు. ఈ కొత్త రకం పదార్థం తయారీకి మల్టీ లేయర్ ప్లాస్టిక్‌ను ఉపయోగించాలి. దీంతో దాన్ని కూడా రీసైక్లింగ్‌కు సేకరించడం ప్రారంభించారు. ఇలా ఓ జటిల సమస్యకు పరిష్కారం కనుగొన్న ఈ రాజ్‌కోట్ విద్యార్థిని పేరుతో చిట్టి గ్రహం 25636కు వైష్ణవ్ అనే పేరు పెట్టారు.

సర్కార్, ముఖర్జీ 'జంట' గ్రహాలు

తాగునీరు, పానీయాల సీసాల మూతల్ని ట్యాంపరింగ్ ద్వారా జరుగుతున్న కల్తీకి అడ్డుకట్టవేశారు అనీశ్ ముఖర్జీ, దేబర్ష్య సర్కార్ అనే బెంగాల్‌కు చెందిన విద్యార్థులు. డిస్పోజబుల్ సిరంజీల్లో వాడే సాంకేతికతను ఉపయోగించి సీసా మూతలను బిగించే పద్ధతిని రూపొందించారు. దీని వల్ల మూతను ట్యాంపర్ చేస్తే ఇట్టే తెలిసిపోతుంది. వాటిని కూడా ఒక్కసారి మాత్రమే ఉపయోగించగలరు. వీరి చిన్న ఆవిష్కరణ పెను మార్పునే సృష్టించింది. ఈ ఇద్దరి మిత్రుల ప్రతిభను గుర్తిస్తూ మైనర్ గ్రహం ఏహెచ్ 52కు ముఖర్జీ 25829గా, మైనర్ గ్రహం 2000 ఏటీ 53కు సర్కార్ 25830గా నామకరణం చేశారు.

విశ్వానంద్ గ్రహం

పేరును బట్టే అర్థమవుతుంది ఇది చదరంగ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ పేరిట పెట్టిందని. అరుణ గ్రహం, జుపిటర్‌కు మధ్య ఉన్న కక్ష్యలో తిరిగే చిట్టి గ్రహాన్ని జపాన్ టొయొటాకు చెందిన కెంజో సుజుకీ 1988లో గుర్తించాడు. కనిపెట్టినవారి పేరిటే నామకరణం చేసే సంప్రదాయం ఉన్నా ఎందుకో ఆయన పేరు పెట్టుకోలేదు. మైనర్ ప్లానెట్ కమిటీ సభ్యుడైన మైకేల్ రుడెంకక్ష విశ్వనాథ్ ఆనంద్‌కు పెద్ద అభిమాని. విషీ సేవలను గుర్తిస్తూ దానికి విశ్వానంద్ అని పేరు పెట్టారు. అలెగ్జాండర్ అలెఖైన్, అనాటోల్య్ కార్పోవ్ తర్వాత మైనర్ గ్రహానికి పేరు పెట్టిన చదరంగ క్రీడాకారుడు విశ్వనాథ్ ఆనందే.

నువ్వు ఎంత మంచి గొంతుతో మాట్లాడతావనేది ముఖ్యం కాదు, నీ గురించి ఎంత మంచిగా మాట్లాడుకుంటున్నారనే దాని గురించి ఆలోచించు.. ఎంత గొప్ప మాట. తన గొంతు బాలేదని ఆత్మహత్యాయత్నం వరకు వెళ్లిన ఓ వ్యక్తి జీవితాన్నే మార్చేశాయి ఆ మాటలు. ఆ తర్వాత ఎందరి జీవితాల్నో మార్చేశాడా వ్యక్తి. గత ముప్పై ఐదేళ్లుగా తను సంపాదిస్తున్నదంతా పేద పిల్లల కోసం దానం చేస్తున్నాడు తమిళనాడుకు చెందిన కళ్యాణ సుందరం. దాతృత్వానికి కొత్త అర్థం చెప్పాడు.

జీ(వి)తమంతా సేవకే...

కళ్యాణ సుందరానికి ఏడాది వయసున్నప్పుడే తండ్రి చనిపోయాడు. తల్లి ఎన్నో కష్టాలు పడి పెద్దవాణ్ని చేసింది. ఆ తర్వాత ఆమె కూడా దూరమైంది. రైల్వే ఫ్లాట్‌ఫారాలు, పేవ్‌మెంట్‌ల మీద బతుకీడ్చిన కళ్యాణ సుందరానికి ఓ సమస్య ఉంది. అతడు చాలా హెచ్చు స్వరంతో మాట్లాడతాడు. ఎంత ప్రయత్నించినా గొంతులో మార్పు వచ్చేది కాదు. ఎన్నో అవహేళనలు, అవమానాలతో పాటు సమస్యల్నీ ఎదుర్కొన్నాడు. ఎవరితోను సరిగా కలవలేక ఒంటరిగా ఉండేవాడు. ఆ ఒంటరితనం కుంగదీసి ఆత్మహత్య చేసుకోవాలనే స్థాయికి పరిస్థితిని దిగజార్చింది. అప్పుడే స్థానికంగా ఉన్న స్ఫూర్తిదాయక రచనలు చేసే ఓ వ్యకి కలిశాడు. ఆయన దగ్గర తన సమస్య చెబితే పైన చెప్పిన మాటలతో కొత్త జీవితానికి దారి చూపాడు.

చిన్నతనంలో పాఠశాలకు వెళ్లాలంటే పది కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సిన పరిస్థితి. అయినా తల్లి చదువు విలువను చెప్పేసరికి ఎంత కష్టం కలిగినా మానకుండా బడికి వెళ్లేవాడు. చదువుకునేలా గ్రామంలోని మిత్రులను ప్రోత్సహించేవాడు. అప్పటి నుంచి రూపుదిద్దుకున్న సేవాభావం క్రమక్రమంగా పెద్దదైంది. యుద్ధ సమయంలో విరాళాల్ని సేకరిస్తున్న సందర్భంగా ఏకంగా ముఖ్యమంత్రిని కలుసుకుని తన తల్లి బంగారు నగను దానం చేశాడు. బహుశ అంత పెద్ద విరాళం ఇచ్చిన పాఠశాల విద్యార్థి ఆయనే అనుకుంటా.



పెళ్లీ లేదు...

కష్టాలను లెక్కచేయకుండా కళాశాల చదువును పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత లైబ్రేరియన్‌గా ఉద్యోగం సంపాదించాడు. తన కష్టాలు తీరినా చుట్టుపక్కల ఎన్నో వేదనలు అనుభవిస్తున్న అనాథ పిల్లల మేలు కోసం తాపత్రయపడేవాడు. అప్పట్లో తనకు వచ్చే 140 రూపాయల జీతంలో వంద రూపాయల్ని పేద పిల్లల చదువుకు ఇచ్చేవాడు. అలా జీతం పెరిగే కొద్దీ వాటాను పెంచుతూ దానం చేశాడు. తర్వాతర్వాత మరింత ఆదాయం కోసం అదనపు పనుల్నీ చేసి వాటిని వీధి బాలల కోసం ఉపయోగించేవాడు. తను రైల్వే ఫ్లాట్‌ఫారాలు, రోడ్డు పేవ్‌మెంట్‌ల మీదేగా కాలం గడిపింది. అది ఎంత కష్టంగా ఉంటుందో ఆయనకు బాగా తెలుసు కనుకే వీధి బాలల్ని సొంత బిడ్డల్లా చూసుకుంటాడు. ఎక్కడ ఈ పనికి ఆటంకం కలుగుతుందేమోనని, మరింత మందికి ఉపయోగపడాలని పెళ్లి కూడా చేసుకోలేదు. తనకంటూ ఏ ఆస్తులూ కూడబెట్టుకోలేదు. వేల రూపాయల విలువున్న ఒక్క వస్తువు కూడా ఆయన దగ్గర లేదు. చాలా సాదాసీదాగా జీవిస్తూ ప్రతి రూపాయిని అనాథ పిల్లల సంరక్షణకే వినియోగిస్తున్నాడు. 35 ఏళ్లుగా క్రమం తప్పకుండా తన జీతం డబ్బును సేవ కార్యక్రమాలకు ఖర్చుపెడుతున్నాడు. చివరకు తన రిటైర్మెంట్ సొమ్ము పది లక్షల రూపాయల్నీ కూడా దానం చేశాడు. నెల నెల వస్తున్న పింఛన్ డబ్బు కూడా సేవకే. ఆయనకు ఎన్నో అవార్డులు వచ్చాయి. ఆయన సేవలను గౌరవిస్తూ 'మేన్ ఆఫ్ ది మిల్లేనియమ్' అవార్డుతో అంతర్జాతీయ సంస్థ సత్కరించింది. ఆ సందర్భంగా ఇచ్చిన దాదాపు 30 కోట్ల బహుమతి డబ్బులో ఒక్క రూపాయిని కూడా సొంతానికి వాడుకోకుండా తన సంస్థ ద్వారా అనాథలకు అందేలా కార్యక్రమాలను చేపట్టాడు. డెబ్బై మూడేళ్ల వయసు నిండినా తన సేవా కార్యక్రమాలకు రిటైర్మెంట్ తీసుకోవడం అటుంచి మరిన్ని బాధ్యతల్ని భుజాన వేసుకున్నాడు. పాలం అనే సంస్థను స్థాపించి దాతలకు, గ్రహీతలకు వారధిగా మారి వికలాంగులు, అనాథలు, వీధి బాలలు, పేద పిల్లల జీవితాల్లో వెలుగుల్ని నింపుతున్నాడు. కేవలం తిండి పెట్టడం కాకుండా చదువు చెప్పిస్తూ వారిని ప్రయోజకులుగా మారుస్తున్నాడు. పెళ్లి, పిల్లలు లేకపోతేనేం ఎందరో ఆయన్ను తండ్రిగా కొలుస్తున్నారు. ఆస్తులు లేకపోతేనేం చిన్నారుల చిరునవ్వుల్ని సొంతం చేసుకోగలిగిన ప్రపంచంలోనే అతి పెద్ద ధనవంతుడిని అంటాడు. నిజమే, ఆయన ఆర్జనను లెక్కకట్టలేం.

'మంత్రాల' జబ్బుకు వైద్యురాలు



“ఊ... పళ్లు ఊడగొట్టండి, నాలుక తెగ్గొట్టండి”, “మొన్నా మధ్య జుట్టు దాస్తుండగా చూశా... గుండు కొట్టండి”, “అమావాస్య అర్థరాత్రి శ్మశానంలో కూర్చుని అగ్గి ముగ్గు వేశాడని చెప్పారు. కాల్చి బూడిద చేయండి....” మంత్రగత్తెలు/మంత్రగాళ్లుగా ముద్ర పడినవారికి మూఢ సమాజం విధించే అమానుష శిక్షలివి. “కోర్కె తీర్చకపోతే మంత్రగత్తెవని ప్రచారం చేసి ఊరి నుంచి తరిమి కొట్టిస్తా.” “భూమి అప్పగించకపోతే మంత్రగాడివని గ్రామంలో నమ్మించి చంపిస్తా.” అమాయకులను లొంగదీసుకోడానికి ప్రయోగించే విషపు మనుషుల మృత్యు పావులివే. చేతికి మట్టి అంటకుండా పని కానిచ్చే పెద్ద మనుషుల నిజమైన కనికట్టు ఇదే. ఇలాంటి హత్యల్ని చూసి చలించిపోయింది అస్సాంకు చెందిన బీరుభలా రభా.

చేతబడి, బొమ్మ, చిల్లంగి, మందు ఇలా పేరు ఏదైనా అనాదిగా మనిషి భయాన్ని ఆశ్రయించి గూడు కట్టుకున్న మూఢ నమ్మకాలకు బలవుతోంది అవి లక్ష్యం చేసుకున్నా యని అనుకున్నవాళ్లు కాదు. వాటి పేరిట లక్ష్యం కాబడినవాళ్లు. మంత్రగత్తెలు, మంత్రగాళ్లన్న నెపంతో వారిపై జరుగుతున్న హత్యలకు లెక్కలేదు. అస్సాంలో ఈ విపరీత మూఢనమ్మకాలు చాలా ఎక్కువ. ఎన్నో కుటుంబాలు ఈ దురాగతాలకు బలైపోయాయి. స్థానిక గిరిజన తెగలైన బోడోలు, రభాలు, మైసింగ్‌లలో ఈ అంధ విశ్వాసం ఎక్కువ.

ఈ ప్రభావంలో ఉన్న గోపాల్‌పురా గ్రామానికి 1954లో కోడలుగా వచ్చిన బీరుభలాకు అక్కడకు వచ్చిన కొద్దిరోజులకే ఓ దుర్ఘటన ఆమెను కలిచివేసింది. మంత్రగత్తె నెపంతో ఓ బడుగు మహిళను దారుణంగా కొట్టి చంపారు. పోలీసుల వరకు విషయం వెళ్లినా హత్య చేసినవారి వివరాలు వెల్లడి కాక కేసు దారితప్పింది. ఇలా ఒకటి కాదు రెండు కాదు పదుల హత్యల్ని, వెలుల్ని ఆమె విన్నది, కన్నది. తీరా చూస్తే ఆ కుటుంబాల ఆస్తులు అన్యాక్రాంతమయ్యేవి. ఇంటి ఆడపిల్ల మీద కన్నుబడి అడ్డంగా ఉన్న ఇంటిపెద్దల్ని మంత్రగాళ్ల నెపంతో అడ్డుతొలగించుకోవడం ఆమె పసిగట్టింది. ఈ దారుణాలపై యుద్ధం ప్రకటించింది. ఐదో తరగతి వరకే చదివినా మంత్రాలకు ఎండుటాకును కూడా రాల్చే శక్తి లేదని తెలుసుకుంది. గ్రామాల్లో వచ్చే విష జ్వరాలకు, అంటు వ్యాధులకు కారణం విష కీటకాలు, సూక్ష్మ క్రిములనే విషయాన్ని తెలుసుకుని దాన్ని ప్రచారం చేసింది. జబ్బు పడినవారికి ఆసుపత్రుల్లో వైద్యం అందేలా చేసి మంత్రాలకు విలువ లేదన్న స్పృహ కల్పించింది. తన గ్రామంలోనే మంత్రగాళ్ల ముద్రపడినవారిని 34 మందిని కాపాడింది. కొందరు పెద్దలు ఆమె ప్రాణాల్ని తీస్తామని బెదిరించినా వెనక్కు తగ్గలేదు. ముందు సామాన్యుల్లో మార్పు తీసుకువస్తే ఈ అరాచకాలకు అడ్డుకట్ట పడుతుందని గ్రహించి మరికొందరిని వెంట తీసుకెళ్లి ప్రచారోద్యమాన్ని ముమ్మురం చేసింది. ఆమె ఉద్యమం గురించి తెలుసుకున్న మహిళ సంఘాలు 1985లో ఠాకూర్ విల్లా మహిళ సమితికి సెక్రటరీని చేయడంతో ఆమెకు మరింత అండ దొరికింది. అలా తన పరిధి పెంచుకుంటూ అసోం మహిళ సమతా సొసైటీ వరకు ఈ అంశాన్ని తీసుకెళ్లింది. ఎక్కడ హత్య జరిగినా వెళ్లిపోయి ధర్నాలు, నిరసనలు చేసేది. ఎన్నో కేసుల్లో సాక్ష్యాధారాలు లేక బయటపడుతున్న హంతకుల వల్ల మరింత నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని గ్రహించి కేసులు నీరుగారకుండా పోలీసులకు సాయపడేది. గ్రామస్తుల్లో చైతన్యం తీసుకువచ్చి హంతకులను పట్టిచ్చేది. ఉన్నత చదువులు చదివినవారు కూడా చేతబడుల వంటి వాటిని నమ్మడాన్ని గుర్తించిన ఆమె పాఠశాలల్లో, కళాశాలల్లోను ప్రచారం నిర్వహించేది. గత ఇరవై ఏళ్లుగా రభా చేస్తున్న పోరాటం వృధా కాలేదు. చాలా గ్రామాల్లో మార్పు వచ్చింది. కేవలం దుష్ట విద్యలపై నమ్మకాన్ని వదిలేయడమే కాక రుగ్మతలకు చికిత్స చేయించుకునేందుకు కూడా మంత్ర విద్యలను ఆశ్రయించకుండా ఆస్పత్రులకు వెళుతున్నారు. నూతన వైద్య విధానాలను ఆహ్వానిస్తున్నారు. రభా సేవల్ని గుర్తిస్తూ నోబెల్ బహుమతికి కూడా స్థానికులు దరఖాస్తు చేశారు. ఎన్నో దాడుల్ని ఎదుర్కొని వందల మంది జీవితాల్ని కాపాడిన బీరుభలా గురించి తెలుసుకున్నవారు ఇతర రాష్ట్రాల్లోను ఆమె పోరాటాన్ని తీసుకెళుతున్నారు.

- ప్రసన్న

పూర్వం ఓ రాజు వ్యాహ్యాళికెళ్లాడు. బక్కచిక్కిపోయి...ఇవాళో రేపో అన్నట్టున్న ఆ వృద్ధుడు ... మొక్కలు నాటుతూ కన్పించాడాయనకు. దేశాధినేతనైన తనే వచ్చి పక్కన నిలబడినా పట్టించుకోలేనంత శ్రద్ధగా మొక్కలు నాటుతున్న ముసలయ్యను చూసి రాజు ఆశ్చర్యపోయాడు. 'ఎందుకు తాతా ఇంత దీక్షగా మొక్కలు నాటుతున్నావు? అవి పెరిగేదెప్పుడు? పూసేదెప్పుడు? కాసేదెప్పుడు? పండేదెప్పుడు? నువ్వు తినేదెప్పుడు?' అనడిగాడట. దానికా తాత తల కూడా ఎత్తకుండానే... తను చేస్తున్న పని ఆపకుండానే ... 'ఇప్పుడు మనం తింటున్న కాయలు, పళ్లు ... మనం నాటిన చెట్లవేనా! పూర్వం తాతలు నాటిన వృక్షాల ఫలాలు! ముందు తరాల వాళ్ల కోసం మొక్కలు నాటుతున్నాను' అన్నాడట తాత. చెట్ల రామయ్య సరిగ్గా అలాంటివాడే. ఒక్క మొక్క కూడా నాటడానికి ఆసక్తి చూపని మనం ... దాదాపు కోటి మొక్కలు నాటిన రామయ్య గురించి తప్పక తెలుసుకోవాలి.

చెట్ల రామయ్య

ఖమ్మం జిల్లాలో 'చెట్ల రామయ్య' తెలీని వారుండరేమో! ఆయన పూర్తి పేరు దారిపల్లి రామయ్య. సైకిల్ ఆయన ప్రియ నేస్తం అనుకోవాలి. సైకిల్ క్యారేజీ మీద, హ్యాండిల్‌కు మొక్కలు కట్టుకుని ఇంటి నుంచి బైటకొస్తాడు. ఇంట్లో నిల్వ చేసిన... రావి, నిద్ర గన్నేరు, కానుగ, వేప, ఎర్ర చందనం, బిళ్వ చెట్ల విత్తనాలను ... చొక్కా జేబులో పోసుకుంటాడు. ఏదో వెతుకుతున్నట్టు పరిసరాలను పరిశీలిస్తూ సైకిల్ మీద ముందుకు సాగుతుంటాడు. ఎక్కడ బోసి నేల కనిపించినా... మొక్కలు నాటేస్తాడు. జేబులో విత్తులు నాటి నీళ్ల పోసేస్తాడు. అలా ఎన్నో ఏళ్లగా నేలతల్లిని హరితమయం చేసేందుకు తన వంతు ప్రయత్నం చేస్తూనే వున్నాడు. ఖమ్మం పల్లెగూడ బ్రిడ్జి నుంచి నాలుగు కిలోమీటర్ల దూరం వరకు తను నాటిన...మొక్కలు ఎదుగుతూ వుంటే చూసి అలౌకికానందం పొందుతుంటాడు.

తల్లే తొలి గురువు

బాల్యంలో అమ్మ వెనకే వుండేవాడు చిన్నారి రామయ్య. ఆమె చేసే ప్రతి పనినీ పరిశీలిస్తుం డేవాడు. ముందునాటికి నాటడానికి పనికొస్తాయని బీర విత్తనాలను జాగ్రత్తగా నిల్వ చేస్తుండేది తల్లి. విత్తులోనే మహత్తంతా వుందని...అది మొలకై. ..మొక్కై...మహా వృక్షమౌతుందని ... మనిషికి ఎనలేని సేవ చేస్తుందని పసితనంలోనే తెలుసు కున్నాడు. ఊహ తెలిసిన దగ్గర నుంచి మొక్కలు నాటసాగాడు. తన చేతి మీదగా జీవం పోసుకుని. ..దినదిన ప్రవర్ధమానమౌతున్న మొక్కలను చూసి ఎంతగానో సంతోషించేవాడు. ఆ సంతోషమే అతనిని వృద్ధాప్యంలోనూ ఇప్పటికీ నడిపిస్తోంది. నిస్వార్థంగా పనిచేసేలా ప్రోత్సహిస్తోంది.

అధ్యయనం...ఆచరణం...

తన చుట్టూ వున్న మొక్కల గురించి... వాటి ప్రత్యేకతలు, పుట్టుపూర్వోత్తరాల గురించి తెలుసుకోవాలన్న ఉత్సుకత రామయ్యలో చాలా ఎక్కువ. అందుకే వీలు దొరికినప్పుడుల్లా... స్థానిక గ్రంథాలయాల్లో...ఆలయాల్లో వున్న పుస్తకాలు తీసుకుని చదువుతుంటాడు. ఇవి చాలవన్నట్టు... సెకెండ్ హ్యాండ్ బుక్‌స్టాళ్లలో మొక్కలకు సంబంధించిన పుస్తకాలు కొని అధ్యయనం చేస్తుంటాడు. దాదాపుగా... తన చుట్టూ వున్న మొక్కలన్నిటి చరిత్ర ఆయనకు తెలుసు.

సొంత స్థలంలో బాగా ఏపుగా పెరిగిన టేకు, ఎర్ర చందనం వృక్షాలను నరికి అమ్మి సొమ్ము చేసుకోవచ్చు కదా... అని బంధువొకాయన



రామయ్యకు సలహా ఇచ్చారట. దానికి ఒక్క నిముషం కూడా ఆలోచించకుండా తను విత్తనా లను సేకరిస్తున్నానని, అందుకా చెట్లు ఎంతగానో ఉపకరిస్తున్నాయని జవాబిచ్చాడు. సొంత నర్సరీలో ... ప్రతి సీజన్‌లో సేకరించిన విత్తనాలను నాటి ... వాటి ఆలనా పాలనా చూడడమంటే రామయ్యకు మహా ఇష్టం. వాటినే ప్రతి రోజూ సైకిల్ మీద సర్దుకుని దూర ప్రాంతాలకు వెళ్లి మరీ నాటుతుంటాడు. ప్రకృతి పట్ల, మొక్కల పెంపకం పట్ల రామయ్యకున్న ఆసక్తిని గురించి తెలిసిన ఓ పెద్దమనిషి ... తన కుమారుడి పెళ్లి సందర్భంగా రామయ్యకు 5 వేల రూపాయలు అందించాడు. ఆ పైకాన్ని సొంతానికి కాక... విత్తనాలు, మొక్కల కొనుగోలుకే వినియోగించాడనుకోండి.

రామయ్య గొప్ప ప్రచారకుడు కూడా. మొక్కలు నాటడం ద్వారా ప్రకృతిని...తద్వారా మానవజాతిని కాపాడుకోవాలని చెప్తుంటాడు. అందుకోసం వీధి గోడలను, కొండ రాళ్లను చక్కగా ఉపయోగించు కుంటాడు. వృక్షో రక్షతి రక్షిత: వంటి సూక్తులను గోడల మీద రాస్తుంటాడు. పోకిరి పిల్లలు వెంటపడి తరిమినప్పుడు సైకిల్ మీద నుంచి పడి కాలు విరిగింది. ఇంటికి పరిమితమైన ఆ సమయంలో రాళ్ల మీద ఉలితో అక్షరాలు చెక్కడం నేర్చుకున్నాడు. అలా బండరాళ్ల మీద మొక్కల రక్షణకు సంబంధిం చిన సూక్తులు రాస్తుంటాడు.

నేటి బాలలే రేపటి పౌరులని ఎలాగైతే చెప్తున్నామో... నేటి మొక్కలే రేపటి వృక్షాలని... ఈ వృక్ష ప్రేమికుడి విశ్వాసం.

నోరూరించే రోటి పచ్చళ్లు

కొబ్బరి పచ్చడి

కావలసిన వస్తువులు

కొబ్బరికాయ - 1
ఎండు మిర్చి - 10
ఉప్పు - సరిపడా
చింతపండు - చిన్న నిమ్మకాయంత
వెల్లుల్లి - 3 రెబ్బలు
జీలకర్ర - టీ స్పూను
నూనె - చిన్న నేతి గిన్నెడు
పోపు సామాను, కరివేపాకు

తయారు చేయు విధానం

ముందుగా కొబ్బరికాయ కొట్టి తురుముకొని కానీ, చిన్న ముక్కలుగా కోసుకొని గానీ పక్కన పెట్టుకోవాలి. బాండీలో నూనె వేసి పొయ్యిమీద పెట్టి కాగిన తర్వాత ఎండు మిర్చి తొడిమలు తీసి వాటిని ఎర్రగా వచ్చేవరకు వేయించుకోవాలి. తర్వాత మిరప కాయలు తీసి అందులోనే పోపు సామాను, కరివేపాకు కూడా వేసి వేయించుకోవాలి. రోట్లో మిరపకాయలు మాత్రం వేసి చింతపండు, వెల్లుల్లి, ఉప్పు, జీలకర్ర వేసి మెత్తగా నూరి అందులోనే కొబ్బరి కూడా వేసి మెత్తగా నూరుకొని తాలింపు పెట్టుకోవాలి. నోరూరించే కొబ్బరి చట్నీ రెడీ. వేడి వేడి అన్నంలో నాలుగు బొట్లు నెయ్యి జోడించి తింటే వుంటుందీ...సూపర్.

వంకాయ పచ్చడి

కావలసిన వస్తువులు

వంకాయలు - అర కిలో
పచ్చి మిరపకాయలు - 50 గ్రాములు
చింతపండు - నిమ్మకాయంత
అల్లం - అంగుళం ముక్క
జీలకర్ర - టీ స్పూను
వెల్లుల్లి - 4 రెబ్బలు
ఉప్పు - సరిపడా
నూనె - 100 గ్రాములు
పోపు సామాను, కరివేపాకు

తయారు చేయు విధానం

వంకాయ ముక్కలను కోసి ఉప్పు నీళ్లలో వేయాలి. బాండీలో కొంచెం నూనె వేసి వంకాయ ముక్కల్ని వేయించి పక్కన పెట్టుకోవాలి. మిగిలిన నూనెలో పచ్చిమిరపకాయల్ని కూడా వేయించుకోవచ్చు. పచ్చి మిరపకాయల్ని వేయించే ముందు కొద్దిగా గాటు పెట్టి వేయిస్తే ఎగిరి మొహాన పడవు. పచ్చిమిర్చి, చింతపండు, జీలకర్ర, ఉప్పు, వెల్లుల్లి, అల్లం అన్నింటినీ రోట్లో వేసి నూరుకొని చివరలో వేయించి పెట్టుకున్న వంకాయ ముక్కల్ని వేసి నూరుకోవాలి. పోపులో కరివేపాకు వేసి దీనిలో కలుపుకుంటే సరి. ఇష్టమైనవారు ఇందులో పెద్ద ఉల్లిపాయ ముక్కల్ని కూడా కలిపితే బావుంటుంది.

దోసకాయ పచ్చడి

కావలసిన వస్తువులు

దోసకాయ - పావు కిలో
చింతపండు - కొంచెం
పచ్చి మిరపకాయలు - కారానికి సరిపడా
జీలకర్ర - టీ స్పూను
ఉప్పు - తగినంత
వెల్లుల్లి - 3 రెబ్బలు
నూనె - చిన్న గరిటెడు
పోపు సామాను, కరివేపాకు

తయారు చేసే విధానం

దోసకాయను పొయ్యి మీద పెట్టి కాల్చుకొని పైన మాడినట్టున్న తొక్కను తీసివేయాలి. పచ్చిమిరపకాయల్ని వేయించి పెట్టుకోవాలి. పచ్చి మిరపకాయలు, చింతపండు, వెల్లుల్లి, జీలకర్ర వేసి మెత్తగా నూరి అందులో కాల్చి పెట్టుకున్న దోసకాయను కూడా వేసి నూరుకొని పోపు పెట్టుకోవాలి.

అరటికాయ పెరుగు పచ్చడి

కావలసిన వస్తువులు

అరటికాయలు - 2
పెరుగు - 1 కప్పు
పచ్చిమిర్చి - 6 (కారాన్ని బట్టి)
ఉప్పు - సరిపడా
చింతపండు - గోలీ కాయంత
పోపుసామాను, కరివేపాకు

తయారు చేయు విధానం

ముందుగా అరటికాయను పెద్ద ముక్కలుగా కోసి ఉడకపెట్టుకోవాలి. పచ్చిమిర్చి వేయించుకోవాలి. పచ్చిమిర్చి, చింతపండు, ఉప్పు కలిపి మెత్తగా నూరుకుని ఉడకబెట్టిన అరటికాయ ముక్కల్ని కూడా కలిపి నూరుకోవాలి. అందులో పెరుగును కలిపి పోపు పెట్టుకోవాలి (అరటికాయ ఉడికిన తర్వాత పై తొక్కు ఇష్టమైతే ఉంచుకోవచ్చు లేకపోతే తీసేయొచ్చు).

వసి వాడని సరోజం

చిన్నప్పట్నించి ఆటపాటలతోనూ ముద్దుమాటల్తోనూ మురిపించేది బి.సరోజాదేవి. అందుకే ఆమెను సంగీతం, నృత్యం నేర్చుకొమ్మంటూ ప్రోత్సహించారు కుటుంబీకులు. అయితే సంస్కృతి, సంప్రదాయాల పట్ల కఠినమైన నిబంధనలను పాటించమని హెచ్చరించేవారు. చామన ఛాయ రంగు.. చీకట్లో సైతం తళతళ మెరిసే కలువల్లాంటి కళ్ళు.. ముత్యాల సరాల్లా మురిపించే పలు వరుస .. చూపరులను సమ్మోహితులను చేసేది. మొట్టమొదట ఆమెను చూసిన బి.ఆర్. కృష్ణమూర్తి సరోజను ఎలాగైనా సినిమాల్లో నటింపచేయాలని పట్టుబట్టాడు. 'చిన్నపిల్ల. ఇంకా చదువుకుంటోంది. తర్వాత చూద్దాంలే' అని సున్నితంగా తిరస్కరించింది తల్లి. అప్పటికి సరోజాదేవి వయసు పదమూడు సంవత్సరాలే!

హోనప్ప భాగవతార్ కన్నడ సినిమా 'మహాకవి కాళిదాసు'లో మొట్టమొదటిసారిగా కథానాయికగా నటించింది సరోజాదేవి. ఆ సినిమాకి జాతీయ అవార్డు రావడం విశేషం! కేవలం సరోజాదేవి మెరిసే కళ్ళు, నృత్య భంగిమల్లో ఆకర్షణ చూసిన బి.ఆర్ పంతులు 'తంగమళై రహస్యం' అనే తమిళ సినిమాలో కథానాయికగా అవకాశం ఇచ్చాడు. అది కూడా సూపర్ హిట్. ఎన్.ఎ.టి బ్యానరులో కమలాకర కామేశ్వరరావు దర్శకత్వంలో 'పాండురంగ మహత్యం' చిత్రం తీస్తున్నారు. అందులో గ్లామరు పాత్ర రంగసాని పాత్ర. ఆ పాత్రకి అతికినట్టు సరిపోతుందని త్రివిక్రమ రావు నమ్మకం. అంజలీ దేవీతో పోటీపడి నటించగలదా? అన్న అనుమానం వచ్చింది. షూటింగు చేస్తున్న సమయంలోనే సరోజను చూసి దేవకన్యలా వున్నావని ప్రశంసల వర్షం కురిపించాడు ఎన్.టి.రామారావు. ఆ సినిమా సూపర్ హిట్ .

అదే సమయంలో తమిళంలో 'నాదోడి మన్నన్' ఎం.జి.ఆర్ సరసన. అదే సమయంలో హిందీలో దిలీప్ కుమార్ , పాయ్‌గమ్ వరుసగా తమిళ, హిందీ, కన్నడ భాషా చిత్రాల్లో అవకాశాలు వెల్లువలా వచ్చి పడ్డాయి. ఏ భాషాచిత్రంలో నటించినా తన డబ్బింగ్ తనే చెప్పుకోవాలన్న షరతు పెట్టింది. దాన్ని ఛాలెంజ్‌గా తీసుకొని అధిగమించింది. ఒక్క 'పాండురంగ మహత్యం' చిత్రంలో మాత్రం కృష్ణకుమారి చేత డబ్బింగ్ చెప్పించారు. ఒకేసారి ఇన్ని భాషాచిత్రాల్లో నటిస్తూ అన్ని చిత్రాలు సూపర్ హిట్ ఖాతాలో వేసుకోగలిన మరో నటి లేదంటే అతి శయోక్తి కాదేమో!

దక్షిణ భాషా చిత్రాల్లో స్టార్‌డమ్ కలిగిన నటీమణుల్లో ఇద్దర్ని ప్రత్యేకించి చెప్పుకోవాలి. ఒకరు మహానటి సావిత్రి అయితే మరొకరు బి. సరోజాదేవి. వీరి కాల్షీట్ల కోసం తమిళ, తెలుగు నిర్మాతలు పడిగాపులు కాసేవారు. తెలుగులో 'పాండురంగ మహత్యం, తర్వాత సీతారామ కళ్యాణం , జగదేకవీరుని కథ, కృష్ణార్జున యుద్ధం, మంచి-చెడు, దాగుడు మూతలు...' ఇలా వరుస హిట్‌లలో తనకు ప్రత్యేక స్థానం సంపాది ంచుకుంది. అక్కినేనితో చేసిన 'పెళ్ళి కానుక' ఆ రోజుల్లో ఓ సంచలనాత్మక ప్రేమకథా చిత్రంగా పేరు తెచ్చుకుంది. 'ఆత్మ బలం, అమరశిల్పి జక్కన్న...' ఒక దాన్ని మించిన చిత్రాలు మరొకటిగా గుర్తింపు పొందాయి. బి.సరోజాదేవి చిలుక పలుకులూ, హంస నడకనూ, ఆమె అందాన్ని తనివితీరా ఆస్వాదించారు తెలుగు ప్రేక్షకులు.

చిత్రమేమిటంటే తెలుగులో ఎన్ని సినిమాలు హిట్ అయ్యాయో తమిళంలో అంతకు మించిన సూపర్ హిట్ చిత్రాలను తన ఖాతాలో జమచేసుకుంది. యం.జి.ఆర్, శివాజీ, జెమినీ, ముత్తురామన్, యస్.యస్.రాజేంద్ర వంటి ఆనాటి అగ్రహీరోలందరి సరసనా నటించింది. ఇప్పట్లా కాదు ఆ రోజుల్లో కొన్ని కండిషన్స్ ఉండేవి. తన సినిమాల్లో నటించేటప్పుడు ... ఇతర హీరోల చిత్రాల్లోనూ... పర భాషా చిత్రాల్లోనూ నటించకూడదని ...ఒక వేళ నటిస్తే ... తన అనుమతి తీసుకోవాలని కండిషన్ పెట్టాడు యం.జి.ఆర్. దాదాపు ఎనిమిది సంవత్సరాల పాటు 1958 నుండి 1966 వరకు ఇద్దరూ కలిసి నటించారు. కష్టసుఖాలు పంచుకున్నారు. వీరి మధ్య కాంట్రాక్టుల షరతులు బి.సరోజకి నచ్చలేదు. ఈ మాట సన్నిహితులతో చెప్పుకొని బాధపడింది. ఆ నోటా ఈ నోటా విని యం.జి.ఆర్ తన కొత్త చిత్రం నుండి తొలగించారు. ఈ విషయం ఎవరో బయటి వారి ద్వారా తెలుసుకొని బాధపడింది.

ఒకేసారి తెలుగు, తమిళంలో ఇతర హీరోలూ...కన్నడంలో రాజ్‌కుమార్, కృష్ణ కుమార్, విష్ణు వర్ధన్ లాంటి హీరోలు తన కోసం ఎదురు చూస్తుండగా ఒక్క యం.జి.ఆర్ కోసమే సంవత్సరాల తరబడి డేట్స్ కేటాయించడం అవివేకం అనిపించింది. అందుకే తను తీసుకున్న నిర్ణయానికి కట్టుబడిఉంది. యం.జి.ఆర్‌తో కలిసి ఇరవై ఏడు సూపర్ హిట్ సినిమాల్లో నటించింది. వీరిద్దరి మధ్య ఈ కమ్యూనికేషన్ గ్యాప్ చిలికి చిలికి గాలి వానయ్యింది. ఇదే సమయంలో జయలలిత రంగ ప్రవేశం చేసింది. వరుసగా యం.జి.ఆర్ తో సినిమాలు చేసింది. తెలుగులో ఎన్‌టిఆర్, అక్కినేని, రామకృష్ణ, శోభన్‌బాబుతో చేసింది.యాదృచ్ఛికంగా బి.సరోజాదేవి స్థానాన్ని జయలలిత తమిళ తెలుగు చిత్రాల్లో ఆక్రమించుకుంది. షూటింగుకి రెండు కార్లలో వస్తుందని.. హీరో కంటే ఎక్కువ పారితోషికం డిమాండ్ చేస్తుందని... అసిస్టెంట్లకు జీతాల విషయంలో పేచీ పెడుతుందని... తన కాస్ట్యూమ్స్ తానే ఎంపిక చేసుకుంటుందనీ... బి.సరోజ మీద విమర్శల వర్షం కురిసింది. అప్పట్లో తన కస్ట్యూమ్ డిజైనర్, మేకప్ మెన్‌కు అత్యధిక పారితోషకం ఇప్పించేది. బి.సరోజా దేవి ఎప్పుడూ సావిత్రితో పోటీ పడేది. నిజానికి సావిత్రికి సరోజ పోటీ కాదు. ఈ విషయాన్ని చివరి రోజుల్లో గుర్తించిన సరోజాదేవి సావిత్రికి దగ్గరయ్యింది. అప్పటికి ఇద్దరూ డౌన్‌ఫామ్‌లో ఉన్నారు. అయినా బి. సరోజాదేవి 'శకుంతల, భాగ్యచక్రం, ఉమా చండీగౌరీశంకరుల కథ, దానవీరశూరకర్ణ' లాంటి చిత్రాల్లో ఎన్.టి.ఆర్ తో నటించి తన కృతజ్ఞత చాటుకుంది. ఎన్.టి.ఆర్ తో 'రహస్యం' చిత్రంలో నటించిందిగాని అప్పట్లో అది రంగుల భారీ ఫ్లాపు చిత్రం! తర్వాత కేవలం కన్నడ పరిశ్రమకే పరిమితమైపోయింది.

అదృష్టాన్ని వెంటాడిన దురదృష్టం

తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో స్టార్ హీరోయిన్ హోదాని సంపాదించుకుంది బి.సరోజాదేవి. అత్యధిక పారితోషికాన్ని అందుకుంది. అగ్ర నటులందరి సరసన నటించి లెక్కకు మించిన అవార్డులు అందుకుంది. 1969లో తను ఇష్టపడి శ్రీహర్షని పెళ్ళి చేసుకుంది. ఇతగాడు మంచి చదువరి. భారత్ ఎలక్ట్రానిక్స్ లో మంచి హోదాలో ఉన్నవాడు. పెద్ద ఇంజనీరు. ఆమె మీద ఎన్ని కథనాలు వచ్చినా అర్థం చేసుకొని అక్కున చేర్చుకోగల సంస్కారి. కేవలం పందొమ్మిది సంవత్సరాల సంసార జీవితంలో ఆమెకు చెప్పకుండా భర్త శాశ్వతంగా దూరమయ్యాడు. సరోజాదేవి జీవితంలో జీర్ణించుకోలేని చేదు నిజం! జీవితంలో తనంత వైభవాన్ని చవిచూసిన వారు లేరు. తనకు తగిలిన ఎదురు దెబ్బలు తిన్న వారు లేరంటూ తన బాధను వ్యక్తం చేసుకుందో సందర్భంలో. ఒక అమ్మాయిని, అబ్బాయిని పెంచుకున్నారీ దంపతులు బి.సరోజాదేవికి ఇందిరా గాంధీ అంటే వల్లమాలిన అభిమానం. అందుకే అమ్మాయికి ఇందిర, అబ్బాయికి రామచంద్రన్ అనే పేరు పెట్టి ... తన కృతజ్ఞత చాటుకుంది. యం.జి.రామచంద్రన్ లేకపోతే తన నట జీవితం లేదంటుంది.

- ఇమంది రామారావు
9010133844

అవార్డులు... రివార్డులు...

బి.సరోజాదేవి 1969 లో పద్మశ్రీ,1922లో పద్మ భూషణ్, 2008లో లైఫ్ టైమ్ ఎఛీవ్‌మెంట్ అవార్డు సాధించుకుంది. 'అభినయ కాంచనమాల' అవార్డు (1980), కర్నాటక రాష్ట్ర ప్రభుత్వ రజతోత్సవ అవార్డు (1989), లైఫ్ టైమ్ ఎఛీవ్ మెంట్ అవార్డు (1997), సినిమా ఎక్స్‌ప్రెస్ చెన్నై, తమిళనాడు గవర్నమెంటు యం.జి.ఆర్ అవార్డు(1997), ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎన్.టి.ఆర్ నేషనల్ అవార్డు (2001) అందుకుంది. ఇవికాక అనేక ప్రభుత్వ, స్వచ్ఛంద సేవాసంస్థల అవార్డులను కైవసం చేసుకుంది.

అక్కినేనితో...

ఎమ్‌జిఆర్‌తో...

ఎన్టీఆర్‌తో...

ఫ్రాన్సులోని మూసా డి లావ్‌రే



సర్వం దర్శనం

కదలకుండానే అనంత కాల ప్రయాణాల్లోకి లాక్కెళుతుంది. ముట్టుకోకుండానే అతీత లోకాల్లోకి ఎత్తుకుపోతుంది.. మ్యూజియం. కాదేది కవితకు అనర్హమన్నట్టు మ్యూజియానికి కూడా వస్తువు నిమిత్తం లేదు. పరిశోధకుల చారిత్రక శిల్పం నుంచి చిన్నారుల ఆట బొమ్మల వరకు, ఆది మానవుల రాతి బాకు నుంచి ఆధునిక మనిషి యుద్ధట్యాంకు వరకు, కళాపిపాసుల మోనాలిసా నుంచి బానిస జీవుల మృత్యుకుహరాల వరకు ప్రతిదీ ప్రదర్శన వస్తువే. మనిషి, ప్రకృతి, భూమిల భిన్నాంశాలను స్పృశిస్తూ పాఠం చెప్పే మ్యూజియమే మానవుడికి నిజమైన ఆరాధనాలయం. అంతరిక్ష అద్భుతాల నుంచి అణువంత విషయాల వరకు అన్నింటికీ దర్పణం పట్టి దర్పం ప్రదర్శించే ఈ ఆలయంలో సర్వం సందర్శనీయమే.

జేఎస్పీ
-9502395077



సాలార్ జంగ్ మ్యూజియంలోని మెఫిస్టోఫిల్స్- మార్గరీటా

చరిత్ర, సైన్స్, ప్రకృతి ఇలా ప్రతి అంశం గురించి విపులంగా తెలుసుకోవాలంటే మ్యూజియానికి మించింది లేదు. పుస్తకాల్లో చదివిన అంశాలే కొత్తగా, మరింత స్పష్టంగా అనుభవంలోకి వస్తాయి. ఒక్క వస్తువే ఎన్నో విషయాల్ని నేరుగా వివరిస్తున్న అనుభూతి కలుగుతుంది. ప్రత్యక్ష వీక్షణానికి ఉండే విలువ వర్ణించలేనిది. స్వతహాగా చూసి తెలుసుకోవడంలో ఉన్న సంతృప్తి దేనిలోను ఉండదు. మ్యూజియం సందర్శన గొప్పదనం అదే. కొందరు ఒక్క శిల్పాన్నే తాదాత్మ్యకంగా రోజుల తరబడి చూసేవారున్నారు. విరిగిన ఓ ఖడ్గాన్ని చూసి తన పూర్వీకుల వీరత్వాన్ని హృదయాల్లో పొంగించుకునే వారున్నారు. ఓ చిన్న సిరా సంతకం తేడాను గుర్తించి కొత్త చరిత్రను అక్షరీకరించినవారున్నారు. శిథిలమవుతున్న శిలాజం ద్వారా అప్పటికప్పుడే కొత్త శాస్త్ర శాఖ పుట్టుకొస్తాయి. ఓ చిన్న కళాఖండం జీవితం సరిపోనంత కళాతృష్ణను తట్టిలేపుతుంది. ఎప్పటికప్పుడు కొత్త సిద్ధాంతాలకు, చరితలకు, భవితలకు, సవాళ్లకు, ప్రశ్నలకు మ్యూజియం బీజం వేస్తుంది. పరిశోధనకు సామగ్రిని సమకూర్చుకున్న మ్యూజియం మానవుని సాధనలో కాలానికి, వేగానికి ఉత్ప్రేరకం. దొర్లిపోయిన గతంతో భవిష్యత్తును అల్లే వర్తమానపు సాధనం. మానవ గతిలో వీటిది బలమైన ముద్ర, విలువైన పాత్ర. అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం (మే 18)ను పురస్కరించుకుని ఈ ఏడాది స్థిరమైన సమాజమనే అంశాన్ని వస్తువుగా తీసుకుంది అంతర్జాతీయ మ్యూజియం కౌన్సెల్. ప్రకృతికి హాని చేయకుండా దాని శ్రేయస్సుతో ముడి వేసుకుంటూ సాగిపోయే మానవుని పురోగమనమే దీని లక్ష్యం. ఆత్మహత్యకు చేరువగా డిప్రెషన్‌లో పడి మునిగిపోతున్న ప్రపంచ మనిషి విధ్వంసకరమైన అభివృద్ధి పరుగు ఆపాలంటే. ప్రతి అంకానికి సాక్ష్యంగా నిలిచిన మ్యూజియాల్లోకి అడుగువేయాల్సిందే. అవి కళ్లకు కడుతున్న సత్యాల్ని గ్రహించి భవితకు మార్గదర్శకంగా తీసుకోవాల్సిందే. గతేడాది నిర్వహించిన

విరిగిన మనసుల ప్రదర్శన

చెలి చేతిన విరిసిన గాజుల అందం... ఓ నాటికి ఆమే తన స్వహస్తాలతో విసిరి కొడితే అది మనసుకు తగిలి విరిచేస్తుంది. మరి ఆ విరిగిన మనసు భావాల్ని పంచుకోవడమెలా. దాని కోసమే ఉంది క్రొయేషియాలోని విరిగిన మనసుల ప్రదర్శన శాల మ్యూజియం ఆఫ్ బ్రోకెన్ రిలేషన్‌షిప్స్. ఆ విసిరేసిన గాజల్ని, విరిగిపోయిన చేతి గడియారాల్ని, ముక్కలైన ప్రేమ స్ఫటికాల్ని పేర్చి విషాదంగా ముస్తాబు చేశారు. వోలింకా విస్టికా, డ్రేజెన్ గ్రుబిసిక్. తొలుత తమ జీవితాల్లో విరిగిపడ్డ బంధాల అవశేషాల్ని ప్రదర్శనకు పెట్టి తమ హృదయ గాయాల్ని పదిమంది కళ్లకు పంచేసి బాధ నుంచి విముక్తులు అవగలిగారట. తమలాగే దెబ్బతిన్న గుండెల జాడలైన వస్తువుల్ని సేకరించి, ఆ తునకలైన ప్రేమ ముక్కల్ని ఓ చోటకు చేర్చి, మరి కొందరు ప్రేమ బాధితులకు ఉపశమనం కల్పించారు.

మ్యూజియం దినోత్సవంలో సేకరణలే లంకెలనే అంశంగా ప్రపంచవ్యాప్తంగా 145 దేశాలకు చెందిన సుమారు 35 వేల మ్యూజియాలు పాల్గొన్నాయి. మ్యూజియం వస్తువుల అక్రమ రవాణా, అత్యవసర పరిస్థితులపుడు రక్షణ వంటి విషయాల్లో కౌన్సెల్ చర్యలు తీసుకుంటోంది.

పరవశంలో పాశ్చాత్యం

విదేశాల్లో మ్యూజియం అనేది జీవన శైలిలో ఓ భాగం. సినిమా, పర్యాటక ప్రదేశాలకు ఏ మాత్రం తీసిపోనంత ఆదరణ ఉంటుంది. చిన్నారుల దగ్గర నుంచి పరిశోధకుల వరకు మ్యూజియం సందర్శన అంటే ఎగిరి గంతేస్తారు. ప్రభుత్వం దగ్గర నుంచి వ్యక్తిగతంగాను వస్తువులను సేకరించి ప్రదర్శించే వారు కోకొల్లలు. మెడికల్, హౌజ్, టార్చర్, అంతరిక్ష, గ్రహాంతర, మహనీయులు, జురాసిక్, యుద్ధ, బ్యాడ్ ఆర్ట్, వ్యాంపైర్, గణిత, శృంగార, వేగుల, సర్కస్, మైనపు విగ్రహాలు వంటి భిన్న అంశాలకు చెందిన మ్యూజియంలు కూడా చాలానే కనిపిస్తాయి. కొన్ని విషాదకర ఘటనలకు సాక్ష్యంగా నిలిచిన ప్రదేశాలు, కట్టడాలను మెమోరియల్ మ్యూజియమ్‌ల పేరిట అభివృద్ధి చేసి నాటి చేదు ఘటనలను కళ్లకు కట్టారు. సెనెగల్‌లోని హౌజ్ ఆఫ్ స్లేవ్స్ ఈ కోవలోకి చెందినదే. గోరీ ద్వీపకల్పం మీద నిర్మించిన ఓ జైలు లాంటి భవనంలో బానిసలను ఉంచి అమెరికా, ఐరోపాలకు బానిసలను తరలించేవారు. బానిసల్ని పాశవికంగా హింసించేవారు. వారిపై అఘాయిత్యాలకు, అత్యాచారాలకు ఇది ప్రత్యక్ష సాక్షి. కేవలం దీని నుంచే అట్లాంటిక్ సముద్రం మీదుగా పది లక్షలకు పైగా బానిసల్ని తరలిం చారం టే ఎంత అమా నుషానికి ఇది కేంద్రమైందో తెలు స్తుంది. దీన్ని యునెస్కో స్మృతి చిహ్నంగా గుర్తిం చింది. కాంబోడి యాలోని ఫ్నామ్ పెన్హ్‌లోని ఓ పాఠశాల భవనాన్ని తాత్కాలిక జైలుగా మార్చి 1975 నుంచి 79 వరకు ఖ్మేర్ రోగ్ సాగించిన అరాచకం వర్ణనాతీతం. ఈ జైలులో సుమారు 20 వేల ప్రాణాల్ని అతి పాశవికంగా బలితీసుకున్నారు. వారిలో చాలా వరకు యువతే. ఆ పాలన అంతమయ్యాక దీన్ని మెమోరియల్ మ్యూజియంగా మార్చి ఆ కర్కశత్వాన్ని ప్రపంచానికి చూపెడుతున్నారు.

సంద్రంలో చిలికిన...

ప్రపంచవ్యాప్తంగా పురాతనమైనవి, పెద్దవి, అందమైనవి, అతిశయ మై నవి మ్యూజి యంలు చాలా ఉన్నా యి . వాటిలో కొన్ని చాలా విశేషమైనవి. ఈ ఏడాది తీసుకున్న సారాం శానికి తగ్గట్టు మెక్సికోలో ఓ మ్యూజియం ఉ ం ది . ఒడ్డుకు



మిరాన్ మలిచిన డిస్కస్ త్రోయర్

సమీపాన సముద్రం అడుగున ఏర్పాటు చేసిన కాన్‌కమ్ జలాంతర్గ మ్యూజియంలో విస్తు పరిచే శిలా విగ్రహాలు ఉన్నాయి. వీటి విశేషమేమిటంటే వీటి తయారీకి ఉపయోగించిన మట్టికి పీహెచ్ న్యూట్రల్ లక్షణం ఉంటుంది. ఇది పగడాలకు ఆవాసంగా విగ్రహాలు మారేందుకు ఉపయోగపడుతుంది. కేవలం పగడాలు పరుచుకోవడంతోనే ఆగిపోదు, వాటి కోసం మరిన్ని జలచరాలు రాకపోకలు సాగిస్తూ ఆ ప్రాంతాన్ని మరింత కనువిందు చేస్తాయి. ఈ మ్యూజియం ఉద్దేశం కూడా అదే. దానికి సమీపాన ప్రకృతి సహజంగా ఏర్పడిన పగడపు దిబ్బలు స్క్యూబా డైవర్ల వల్ల పాడైపోతున్నాయి. వాటి నుంచి దృష్టి మరల్చేందుకే పర్యాటకులు, స్క్యూబా డైవర్ల కోసం ఈ పథకాన్ని రచించారు. వీటిని చూడాలంటే స్క్యూబా డైవ్ చేయాలి. అంత సాహసం చేయలేని వారికి, ఆరోగ్యం సహకరించని వారికి, పిల్లల కోసం ఓ ప్రత్యేక పడవను ఏర్పాటు చేశారు. దీని అడుగు భాగం పారదర్శకంగా ఉండే గ్లాసు లాంటి పదార్థంతో చేశారు. పడవ అడుగు నుంచి సుందరమైన శిల్పాలను తేరిపార చూడొచ్చు.

ప్రపంచమంతా లండన్‌లో

వలస రాజ్యాల విస్తరణలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎన్నో ప్రాంతాల్ని, సంస్కృతుల్ని, జాతుల్ని, సంపదను, కళల్ని, విజ్ఞాన, శాస్త్ర, సాంకేతికలకు ప్రత్యక్షంగా చూసిన బ్రిటీష్‌వాళ్లు విలువైన వాటన్నింటినీ లండన్ తరలించారు. వాటిలో కొన్నింటికి బ్రిటీష్ మ్యూజి యంలో చోటు కల్పించారు. ముఖ్యంగా ఈజిప్టు, సుమేరియన్ వంటి సంపన్న సంస్కృతుల వైభవాన్ని పట్టి చూపే పురావస్తువులు ఇక్కడ చాలా కనిపిస్తాయి. మన జాతి సంపద కూడా చాలా తరలిపోయింది. షాజహాన్ నెమలి సింహాసనం, కోహినూర్ వజ్రం లాంటివి అక్కడే ఉన్నాయి. మన అమరావతికి చెందిన శిల్పాలు, వస్తువులతో ఓ గేలరీనే ఏర్పాటు చేశారు. రాతి యుగపు ఆనవాళ్ళ నుంచి ఏథెన్స్‌కు చెందిన పార్థినన్ సంపద వరకు సుమారు 80 లక్షల వస్తువులు ప్రదర్శనకు ఉంచారు. అస్సీరియన్ ప్యాలెస్ భవంతుల నుంచి అతి విలువైన బంగారు ఆభరణాల వరకు ఎన్నింటినో భద్రపరిచారు. ఈజిప్టు వెలుపల వారి సంపద ఎక్కువగా పోగుబడినది ఇక్కడే. క్రీ.పూ. 196కు చెందిన అతి విలువైన రోసెట్టా స్టోన్ కూడా ఇక్కడే ఉంది. ఇదే పురాతనమైన ఆధునిక మ్యూజియం.

మోనాలిసా లవ్వరే..

ప్రపంచంలో అతి పెద్ద మ్యూజియం సేకరణ ఏదని అడిగితే ఫ్రాన్స్‌లోని మూసా డి లావ్‌రేను చెబుతారు. ఇక్కడే లియోనార్డో డావిన్సీ చిత్రించిన ప్రఖ్యాత మోనాలిసా ఉంది. సుమారు 200 ఏళ్ల క్రితం ప్రాచీన రాజ గృహ సముదాయాన్ని మ్యూజి


సారనాథ్ తథా గథుడు

యంగా మార్చారు. దీని ముఖ ద్వారంగా 1989లో ఐ.ఎం. పే పిరమిడ్‌ను ఏర్పాటు చేశారు. ఇదే ఓ ప్రత్యేక ఆకర్షణ. ఇందులోను లక్షలాది వస్తువులు ఆకర్షణీయంగా అమర్చారు. వీనస్ డి మిలో, వింగ్డ్ విక్టరీ ఆఫ్ సామోత్రేస్ ప్రత్యేకమైనవి. ఏటా కోటి మంది దీన్ని సందర్శిస్తారంటే ఆశ్చర్యంలేదు.

స్వర్ణ సందర్శనం

రష్యా లోని సెయిం ట్ పీటర్స్‌బర్గ్‌లో ఉన్న స్టేట్ హెర్మిటేజ్ మ్యూజియం చాలా ప్రత్యేకమైనవి. అంబర్ అద్దుకున్న గోడలు, స్వర్ణ తాపడం చేయించిన గదులు, బంగారు ప్రదర్శన వస్తువులతో హెర్మిటేజ్‌లోని ఓ ప్రభువుల రాజ గృహ సముదాయంలోని నాలుగు భవంతులకు తోడు మరో రెండు కట్టడాల్లోని 120 గదుల్లో సుమారు 30 లక్షల వస్తువులను భద్రపరిచారు. రాణి కేథరిన్ బెర్లిన్ నుంచి ఖరీదు చేసిన 255 చిత్రాలను తొలుత ప్రదర్శించగా తర్వాత అదే పెద్ద మ్యూజియంగా మారిపోయింది. రెంబ్రాంట్, రూబెన్స్, డావిన్సీ, పికాసో, వాన్ గాగ్ వంటి ఎందరో అద్భుత కళాకారుల చిత్రాలను ఇక్కడ చూడవచ్చు. స్వర్ణంతో తయారైన నెమలి గడియారం ఇక్కడే ఉంది. మైకేలాంజిలో క్రౌచింగ్ బాయ్, లియోనార్డో డావిన్సీ టూ మడోన్నాస్, ఆంటోనియో కనోవాస్ త్రీ గ్రేసెస్ తప్పక చూడాల్సినవి.

పదేళ్లయినా చాలదు

అమెరికా వాషింగ్టన్ డీసీలోని స్మిత్సోనియన్ ఇన్‌స్టిట్యూట్ ప్రపంచంలోనే అతి పెద్ద పరిశోధన సందర్శన శాల. పందొమ్మిది మ్యూజియంలు, జంతు ప్రదర్శనశాల, గ్యాలరీలతో కలిసి ఉంటుంది. ఇక్కడ 13 కోట్ల 70 లక్షలకు పైగా ప్రదర్శన వస్తువులున్నాయి. వీటిని రాత్రిపగలూ తేడా లేకుండా ఒక్కో వస్తువును ఒక్కో నిమిషం చూసినట్టయితే పదేళ్ల సమయం కూడా సరిపోదు. చాలా ప్రణాళికతో విభాగాల్ని ఎంపిక చేసుకుని వెళ్లాలి. శాపగ్రస్తమైనదిగా భావించే హోప్ డైమండ్ ప్రస్తుతం ఇక్కడే ఉంది. రైట్ సోదరుల విమానం, స్పిరిట్ ఆఫ్ సెయింట్ లూయిస్‌తో పాటు, అపోలో 11 వ్యోమనౌక కమాండ్ మాడ్యూల్ కూడా ఇక్కడ సందర్శించవచ్చు.

మనవి మసక వెలుగులు

మన దేశం విషయంలో మ్యూజియంలు నానాటికీ ప్రభను కోల్పోతున్నాయి. విదేశాల్లో ఉన్నంత విస్తృతంగా ఇక్కడ ఆదరణ లేదు. పాలక పక్షాల నిర్లక్ష్యం, నిధుల కొరత, పరిశోధకులకు లభించని మద్దతు, నవతరంలో ఆయా రంగాలపై ఆసక్తి లేమి, ప్రచారం లభించకపోవడం వంటి అనేక సమస్యలతో మ్యూజియాలు కుంటుపడుతున్నాయి. మ్యూజియం నిర్వహణ ఖర్చుతో కూడకున్న పనికావడంతో వ్యక్తిగతంగాను ఇటువైపు ఎవరూ రావడం లేదు. విదేశీ మ్యూజియాల్లో పెద్ద పీట వేస్తున్న ఎంతో విలువైన జాతి సంపద స్మగ్లర్ల చేతుల మీదుగా దేశం దాటిపోతున్నాయి. బ్రిటీష్ కొల్లగొట్టిన సంపదను వెనక్కు తెచ్చే సంకల్పం, చొరవ కొరవడుతోంది. మన దేశంలోను కొన్ని ప్రఖ్యాతమైన మ్యూజియంలు కొలువై ఉన్నాయి. వాటిలో ఢిల్లీలోని నేషనల్ మ్యూజియం, కోల్‌కతాలోని ఇండియన్ మ్యూజియం ప్రధానమైనవి. నేషనల్ మ్యూజియంలో అశోకుడి కాలానికి చెందిన బుద్ధ విగ్రహాలు, స్థూపాల అవశేషాలు ప్రధాన ఆకర్షణ. ఇండియన్ మ్యూజియంలో ఈజిప్ట్ మమ్మీని కూడా ప్రదర్శనకు ఉంచారు. ముంబైలోని ప్రిన్సెస్ ఆఫ్ వేల్స్ మ్యూజియంలో కూడా అపారమైన పురావస్తు సంపదను ప్రదర్శనకు ఉంచారు. మద్రాస్ గవర్నమెంట్ మ్యూజియంలో విజయనగర, చాళుక్య, చోళుల వస్తు సంపద భద్రపరిచారు. ఇవికాక చాణక్యపురిలోని రైల్వేస్ మ్యూజియం, అహ్మదాబాద్‌లోని కలికో మ్యూజియంలు కూడా చాలా బాగుంటాయి.

మన వారధి

వేల ఏళ్ల తెలుగు వారి వారసత్వానికి, సంస్కృతిని చాటి చెప్పే నేటి తరానికి వారధులుగా

టెర్ర'కోట'

చైనా మొదటి చక్రవర్తి క్విన్ షి హువాంగ్‌కు మసోలియంగా రూపొందించిన ఓ భారీ నిర్మాణంలో భాగమే ప్రపంచ ప్రసిద్ధి చెందిన టెర్రకోట విగ్రహాలు. క్రీపూ. 210 నాటికి చెందిన ఈ మహా నిర్మాణంలో ప్యాలెస్‌లు, శిఖరాలు, తోటలు వంటి వాటిన్నెంటినో నిర్మించారు. చక్రవర్తి మరణానంతర జీవితంపై ఆసక్తి తెలియజేస్తుంది ఇది. సుమారు ఏడు లక్షల మంది కార్మికులు దీన్ని నిర్మించారని అప్పటి ప్రఖ్యాత షిజీ గ్రంథకర్త సీమా క్వియాన్ (క్రీపూ. 145, 90) పేర్కొన్నారు. వంద నదుల్ని పాదరసం సాంకేతికత ద్వారా దీనిలో సృష్టించారు. సుమారు 8 వేల మంది సైనికులు, 130 రథాలు, 520 గుర్రాలు, 150 అశ్వ సైన్యంతో పాటు సంగీతకారులు, నృత్యకారులు, ఉల్లాసినులు, దాసీ జనాలు వంటి వారందరూ ఉన్నట్టు టెర్రకోట విగ్రహాలను మలిచారు. కాల దోషం మూలంగా వాటి రంగులు చెరిగిపోయినా ఇప్పటికీ అద్భుతంగా సజీవ కళతో కనిపిస్తాయి.కేవలం గ్రంథాల్లో ఉన్న వివరణలు 1974లో ఆధార రూపంలో బయల్పడ్డాయి. జియాన్ ప్రావిన్స్ లింటాంగ్‌లో స్థానిక రైతు ఒకరు బోరు వేస్తుండగా వీటి అవశేషాలు బయటపడ్డాయి. అక్కడ తవ్వకాలు జరపడంతో ప్రపంచంలో మరెక్కడా లేనంత విస్తృత స్థాయిలో ఈ పురాతత్వ సంపద వెలుగులోకి వచ్చింది. అప్పటి నుంచి దేశవిదేశీ మ్యూజియాల్లో వీటిని ప్రత్యేకంగా ప్రదర్శిస్తున్నారు. ఆ ప్రదేశాన్ని కూడా సందర్శనకు అనుమతి ఇస్తున్నారు. మన జాతి సంపద కూడా దీనికి తక్కువేమీ కాదు. కానీ నిర్లక్ష్యం మూలంగా అవి వెలుగులోకి రావడం లేదు. భూమి అంతర్భాగంలోనే శిథిలమైపోతున్నాయి. ఇక్కడ పరిశోధనలు ముమ్మరమై, ప్రభుత్వం నుంచి తగిన మద్దతు లభిస్తే ఎన్నో విషయాలు వెలుగులోకి వస్తాయి.

వింగ్‌డ్ విక్టరీ ఆఫ్ సామోథ్ క్రేస్ (120బి.సి)

స్కిథియన్ దువ్వెన

స్లీపింగ్ మ్యూస్



ఈజిప్టు లోని పిల్లి విగ్రహం

నిలుస్తూ కొన్ని మన రాష్ట్రంలోను కొన్ని మ్యూజియాలు ఉన్నాయి. అమరావతి, విజయవాడ, నాగార్జున కొండ, కొలనుపాకల్లో మ్యూజియాలున్నాయి. వీటిలో మన తెలుగు భాష లిపి, స్థానిక రాజుల నాణేలు, బుద్ధుని అపురూపమైన శిల్పాలు అనేకం ఉన్నాయి. ఇక్కడ బయల్పడిన ఆది మానవుల అవశేషాలను కూడా పొందుపరిచారు. కొలనుపాకలో 11వ శతాబ్దం నాటి కళ్యాణి చాళుక్యుల రాజధానిగా ఉన్న ఈ ప్రాంతంలో జైన మతం పరిఢవిల్లింది. వాటికి సంబంధించిన ఎన్నో చిత్రాలు, శిల్పాలు ఇక్కడ దర్శనమిస్తాయి. విజయవాడలోని విక్టోరియా జూబిలీ మ్యూజియం 1887 నాటిది. ఇక్కడ క్రీ.శ. 2 శతాబ్దం నాటి శిల్పాలెన్నో ఉన్నాయి. తెల్ల సున్నపు రాతి బుద్ధ విగ్రహం, ఎహెూదెస శివ విగ్రహం, మహిషాసుర మర్దిని విగ్రహాలు అపురూపమైనవి. పురాతన నాణేలు, ఖడ్గాలు, ఆభరణాలను చూడొచ్చు. ఆది మానవుని కాలం నాటి రాతి వస్తువులను కూడా ప్రదర్శనకు ఉంచారు. అమరావతిలో బుద్ధుని మహా చైత్యం ఉంది. క్రీ.పూ. 3 శతాబ్దం నాటి వస్తువులు ఇక్కడ బయల్పడ్డాయి. బౌద్ధానికి అమరావతి, నాగార్జున కొండతో విడదీయరాని బంధముంది. ఆ మతానికి దక్షిణాది రాజధానులుగా ఇవి వెలుగొందాయి. ఇప్పుడు రాష్ట్ర రాజధానికి అమరావతిగా ప్రకటించడానికి ఈ వైభవోపేత చరిత్ర ఓ కారణం.

వర్చువాలిటీలో చక్కర్లు కొడుతున్న అంతర్జాల తరమిది. కేవలం 2 డైమెన్షనల్‌లో చిక్కుకుపోతోంది నేటి తరం. వారి బుర్రల్లో మ్యూజియాలకు బూజు పడుతోంది. ముఖ్యంగా మన దేశంలో మ్యూజియం సందర్శన అనేది పాతకాలం నాటి మాట అయిపోతోంది. ఒకప్పుడు యాత్ర ప్రదేశాలకు సమానంగా మ్యూజియాలు ఆదరణ పొందేవి. కేవలం వాటి సందర్శన కోసమే తేదీలు, సెలవులు ఖరారయ్యేవి. కానీ ఇప్పుడు మ్యూజియంల స్థానే చాలా విషయాలు యువత ప్రాముఖ్యాలను ఆక్రమించేశాయి. పబ్లిక్ పార్క్‌లకున్నంత క్రేజ్ మ్యూజియంలకు లేదు. మ్యూజియాల విలువ తెలీక నిరాదరణకు గురవుతున్నాయి. పట్టుమని పది మ్యూజియాల పేర్లు చెప్పలేని పరిస్థితి. సందర్శకుల ఆదరణ కోల్పోయినవి కొన్నయితే ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నవి కొన్ని. మ్యూజియాల విలువ గురించి ప్రచారమే ఉండదు. ఇక కొత్త తరానికి వాటి జాడ ఎలా తెలుస్తుంది. ఈ ఉదాసీనత నుంచి బయటపడితే ఎంతో ప్రాచీనమైన భారత జాతి సంస్కృతి, కళా వైభవం, విజ్ఞానం ముందు తరాలకు అందుతుంది. విదేశాల్లోని మ్యూజియాల్లో ఎంతో అబ్బురంగా చూస్తున్న మన పురావస్తు సంపదకు ఇక్కడా తగిన గౌరవం లభిస్తుంది. ఉన్న మ్యూజియాల్లో వసతులు మెరుగు పరిచి, వాటి సంరక్షణకు ఏర్పాట్లు చేసి మంచి ప్రచారం లభిస్తే వాటి పూర్వ వైభవం అందుకుంటాయి. విదేశీ మ్యూజియాల్లో మగ్గిపోతున్న మన సంపదతోపాటు, వివిధ సంస్కృతులకు చెందిన వివిధ ప్రాంతాల నుంచి మరికొన్ని వస్తువుల్ని సేకరించగలిగితే కొత్త జీవం పోసినట్టే. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాల విద్యార్థుల సందర్శన యాత్రలకు ప్రభుత్వం తరపున సహాయం అందాలి. కేవలం పుస్తకాలకే పరిమితమైన జ్ఞానం కాకుండా మ్యూజియంల సందర్శనను విద్యా విధానంలో చేర్చాలి. ఎందరో మహనీయులకు స్ఫూర్తి నింపింది, ప్రేరణనిచ్చింది అద్దాల చాటున దాగున్న ఈ ప్రదర్శన వస్తువులే. ఒక్కసారి మ్యూజియంలో అడుగు పెట్టి చూడండి మనిషి, భూమిల కథను కళ్లకు కట్టి భావోద్వేగానికి గురిచేస్తాయి. అది మన కథే. అవి చెప్పేవి మన సంగతులే. అది మనుగడ జాడ.

✦

సలామ్ సాలార్ జంగ్

ఒక వ్యక్తి సేకరించిన వస్తువులతో నిర్మించిన మ్యూజియాల్లో మన సాలార్‌జంగ్ మ్యూజియమే అతి పెద్దది. నవాబ్ మీర్ యూసఫ్ అలీ ఖాన్‌కున్న మరో పేరు సాలార్ జంగ్3 ఈ మ్యూజియాన్ని రూపొందించారు. ప్రపంచ నలుమూలల నుంచి సేకరించిన అనేక అద్భుత వస్తువులతో కొలువై ఉండే ఈ మ్యూజియం ప్రపంచ మ్యూజియం ప్రియుల్ని విశేషంగా ఆకర్షిస్తుంది. కేవలం దీని కోసమే హైదరాబాద్ వచ్చే పర్యాటకులు ఉన్నారు. చూపరులను కట్టిపడేసే మేలి ముసుగు రెబెకా పాల రాతి విగ్రహం ప్రత్యేక ఆకర్షణ. ఇటలీకి చెందని శిల్పకారుడు బెంజోనీ తయారు చేసిన ఈ విగ్రహంలోని కళా సౌందర్యం వర్ణనాతీతం. పారదర్శకంగా ఉండే ముసుగు కప్పుకున్న స్త్రీ మూర్తిగా దీన్ని చెక్కారు. ముసుగు మడతల్లోంచి ఆమె ముఖం, శరీర భాగాలు కనిపిస్తున్నట్టు దీన్ని మలిచారు. క్రీ.శ. 14 శతాబ్దానికి చెందిన కృష్ణ లీల మినియేచర్ చిత్తరువులు కూడా మతి పోగొట్టేస్తాయి. గణిత శాస్త్రంలో మన పూర్వీకుల ప్రజ్ఞకు సాక్ష్యంగా నిలిచే లీలావతి గ్రంథం కూడా ఇక్కడ భద్రపరిచి ఉంది. అందరికీ స్వాగతం చెబుతున్నట్టు సందడి చేసే గడియారం గురించి వేరే చెప్పనవసరం లేదు. ఇక్కడున్న 38 గ్యాలరీల్లో సుమారు పది లక్షల వస్తువులను ప్రదర్శనకు ఉంచారు.

రెబెకా

రేపటి బీడు

ఎమ్వీ. రామిరెడ్డి
-9866777870

సిపిఎం జాతీయ మహా సభల సందర్భంగా జరిపిన పోటీలో తృతీయ బహుమతి పొందిన కథ

మా వైపు కోర్టులో శ్రీను ఒక్కడే మిగిలాడు. కూతకెళ్లి, ఇద్దర్ని అవుట్ చేయడంతో; నేను, రమేష్ బతికొచ్చాం. ఇప్పుడు కోర్టులో ముగ్గురమయ్యాం. స్కోరు సమానమైంది. ఒకే ఒక్క పాయింటు. ఎవరికొస్తే వారు విజేత. చుట్టూ చేరిన విద్యార్థులు, ఉపాధ్యాయులు చప్పట్లు కొడుతూ ప్రోత్సహిస్తున్నారు.

గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామంలోని సెయింట్ మేరీస్ హైస్కూలు. సాయంత్రం అయిదు కావస్తోంది. విశాలమైన మైదానం మధ్యలో కబడ్డీ ఆట క్లైమాక్సుకు చేరింది.

అవతలి వైపు కెప్టెన్ కూతకు సిద్ధమయ్యాడు. మా నలుగురికీ లోలోపల వణుకు మొదలైంది.

సుమారు ఎనభై కేజీల బరువుండే ఆ శాల్రీని అటకాయించడం అంత తేలిగ్గాదు. ముగ్గురం ఒకరికొకరం ధైర్యం చెప్పుకున్నాం. ఓ ప్రణాళిక సిద్ధం చేసుకున్నాం. కబడ్డీ...కబడ్డీ.. అంటూ మా కోర్టులో సగం దూరం వచ్చాడో లేదో మా శ్రీనుగాడు పాములా నేలమీద పాకి, అతగాడి కాళ్లను చుట్టేశాడు. మేమిద్దరం వెనకా ముందూ వాటేసుకుని కదలకుండా చేశాం. అంతే పిల్లల కేరింతలు మైదానంలో ప్రతిధ్వనించాయి. జోనల్ పోటీల ఫైనల్స్ మా స్కూలు గెలిచింది.

మరుసటి రోజు టీమంతా ఒకచోట చేరి, పార్టీ చేసుకున్నాం. పది పప్పుండలు, పది నూజీడీలు, చాక్లెట్లు, రెండు గోల్డ్‌స్పాట్ బాటిళ్ల తెచ్చుకుని సమానంగా పంచుకుని సంతోషంగా గడిపాం. అప్పుడే మేం పదో తరగతి చదువుతున్నాం.

మా ముగ్గుర్నీ అందరూ పొగిడారు. ఆరో తరగతి నుంచే మాది విడదీయరాని అనుబంధం, రమేష్‌ది శాఖమూరు. రోజూ సైకిల్‌పై వచ్చేవాడు. ఒక్కో సారి, నాలుగు కిలోమీటర్లు నడిచే వచ్చేవాడు. శ్రీను, నేను పెదపరిమి వాసులమే. శ్రీను తండ్రి నాలుగెకరాల రైతు. మాకు పదికెరాలపైనే ఉండేది. ఓ రోడ్డు ప్రమాదంలో నాన్న మృతి చెందడం, ముగ్గురు పిల్లల్ని చదివించాల్సిరావడంతో, అమ్మ, ఒక్కో ఎకరం అమ్ముసాగింది. ఆదివారం వచ్చినా, పండగ సెలవు వచ్చినా నేనూ శ్రీనూ పొలం పనులకు వెళ్లేవాళ్లం. వాడు గొడ్డులా కష్టపడతాడు. మునుంలో దిగాడంటే, పత్తి చకచకా తెగి, వాడి 'పంచె' గబగబా నిండాల్సిందే. పత్తి మోళ్లు పీకడం మొదలు పెట్టాడంటే, మేం వాడి వెనుక పరుగులు పెట్టాల్సిందే.

సంక్రాంతి రోజు చూడాలి మా ముచ్చట! శ్రీను, నేను కొత్త చొక్కా, కొత్త నిక్కరు తొడుక్కుని తాడికొండ సినిమాకు వెళ్లేవాళ్లం, నాలుగు కిలోమీటర్లు నడిచి. అరుదుగా అలాంటి 'పండగ'లు మాకు అదృష్టాన్ని తెచ్చిపెట్టేవి. పదో తరగతి ప్రథమ శ్రేణిలో పాసైనందుకు నన్ను మా బంధువులందరూ అబ్బురంగా చూశారు. సెకండ్ క్లాస్‌లో పాసైన శ్రీను చదువు మానేసి, తండ్రికి తోడుగా తలగుడ్డ చుట్టి నాగలి పట్టాడు.

శ్రీను బాగానే చదివేవాడు. రమేష్ పప్పుసుద్ద. నేను బాగా చదువుతాననీ, అన్ని పరీక్షల్లోనూ మంచి మార్కులు సాధిస్తానన్న గర్వం తలకెక్కి, రమేష్‌ను చిన్నచూపు చూస్తున్న తరుణంలో ఓ రోజు సాయంత్రం స్కూలు వదలగానే రమేష్‌తో కలిసి వాళ్ల ఊరికి వెళ్లాల్సి వచ్చింది. ఆ రాత్రి వాళ్లింట్లోనే ఉన్నాను.

"ఏం బాబూ నువ్వన్నా బాగా సదువుతావా, లేక మా సన్నాసిలాగానేనా" అన్నం వడ్డిస్తూ అడిగింది రమేష్ తల్లి. నేను నవ్వి ఊరుకున్నాను. వాడు మాత్రం "అట్టనమాకమ్మా, ఆడు క్లాస్‌లో ఫస్టు" అన్నాడు. "అవునా! మానాయనే, మానాయనే..." అంటూ మెటికలు విరిచింది.

ముద్దపప్పు, గోంగూర పచ్చడి, వంకాయ ఇగురు, ఉలవచారు, ఆ భోజనం రుచి ఇప్పటికీ నాలుకపైనే ఉంది. భోజనాలయ్యాక రాత్రి పదింటికి నిద్రపోయాం. ఉదయం ఆరున్నర అవుతుండగా మెలకువ వచ్చింది.

"కానీ కానీ, పని ఒగదెగడంలా. గేదెల్ని కట్టేయ్. పేడకళ్లు తీసేయ్...' పంచలోంచి రమేష్ వాళ్ల నాన్న కేకలు వినిపిస్తున్నాయి. బద్ధకంగా ఒళ్లు విరుచుకుంటూ బయటికొచ్చి, మెల్లా మీదికి చూపు సారించాను.

"అదుగో, ఆ సిబ్బిలో పేడ దీసుకెళ్లి దిబ్బలో పడేయ్. ఎడ్లకు ఉలవలు పెట్టు. గేదె మూతికి సిక్కం గట్టి గాటికి కట్టేయ్. పాలికట్టె దీస్కోని చెత్తంతా ఊడ్చేయ్. దూడకు కుడితి తాగించు... "వాళ్ల నాన్న, తన తొడమీద గోగుతాడు పేనుతూ, రమేష్‌కు పనులు పురమాయిస్తున్నాడు. వాడు యంత్రంలా ఒకదాని తర్వాత ఒక పని చక్కబెడుతున్నాడు. అయినా ఆయన హడావుడి చేస్తూనే ఉన్నాడు.



మధ్యలో ఒకట్రెండు దెబ్బలు కూడా వేశాడు.

నేను బ్రష్ చేసి, టిఫిన్ చేసే లోపల, రమేష్ పొలం వెళ్లి, సైకిల్ మీద మేత మోపు తెచ్చాడు.

హడావిడిగా స్కూలుకు సిద్ధమయ్యాడు. నేను వెనక కూచోగానే సైకిల్‌ను ముందుకు దూకించాడు రమేష్. "సారీరా..." పొలాల మధ్య డొంకదారిలో ఉసీగా సైకిల్ తొక్కుతున్న రమేష్ వీపుమీద చెయ్యివేస్తూ అన్నాను. "ఎహే, ఇయ్యేమీ నువ్వు పట్టించుకోమాక. మనకిది రోజూ మామూలే..." తేలిగ్గా కొట్టిపారేశాడు రమేష్. ఆ తర్వాత నేను ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పాఠాలు వివరిస్తూ, వాడు పదో తరగతి పాసవడానికి శక్తి వంచన లేకుండా తోడ్పడ్డాను.

విద్యాభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలు నిర్వహించే బాధ్యత మీది." వివరించాను.

అలా ప్రారంభమైన 'చేయూత' స్వచ్ఛంద సంస్థ అతి త్వరలోనే పిల్లల నేస్తమైంది. వారి చదువులకు మార్గదర్శి అయింది. ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉపకారవేతనమైంది. మెల్లగా గ్రామ పెద్దలు కూడా సంస్థలో సభ్యులయ్యారు. మా కార్యక్రమాలకు అండగా నిలిచారు.

2007 మార్చి 21

పెదపరిమిలో రైతులకు శిక్షణ శిబిరం ప్రారంభమైంది. అయిదు వందల మందికి పైగా హాజరైన రైతులనుద్దేశించి లాంఫాం శాస్త్రవేత్త అనర్గళంగా ప్రసంగిస్తున్నారు. అందరూ శ్రద్ధగా

"రామ్, భూమిని ప్రభుత్వానికి అప్పగించక తప్పేట్టు లేదు..' ఫోన్‌లో చాలా నీరసంగా ఉంది శ్రీను గొంతు. "ఎందుకని? మీరంతా కలిసి అభ్యంతర పత్రం సమర్పించారుగా" అడిగాను."అధికారులు తెలివిగా బెదిరిస్తున్నారు. ఈ నెల 28 లోపు భూమిని అప్పగిస్తే మనకు ఎకరానికి పన్నెండొందల గజాల స్థలం కేటాయిస్తారట. అది భవిష్యత్తులో కోట్ల ఖరీదు చేస్తుందట. లేకపోతే భూ సేకరణలో భాగంగా బలవంతంగా లాగేసుకుని, తృణమో పణమో పరిహారంగా ఇస్తారట." బాధగా చెప్పాడు శ్రీన్ను"మరి ఏం చెయ్యాలనుకుంటున్నావు?" "ఇచ్చేదామ్‌రా. ఈ టెన్షన్ మనం భరించలేము. రాత్రికి బయల్దేరి వచ్చెయ్. నీది కూడా ఇచ్చేదువు గానీ."

1995 ఆగస్టు15

ముగ్గురం రాములవారి గుళ్లో సమావేశమయ్యాం. నేనొస్తున్నానని ఉత్తరం రాయడంతో రమేష్ కూడా పరిమి వచ్చాడు. అప్పటికీ నేను డిగ్రీ పూర్తి చేసి ఓ దినపత్రికలో సబ్ ఎడిటర్‌గా పని చేస్తున్నాను. రమేష్, శ్రీను వ్యవసాయాన్నే నమ్ముకున్నారు. "ఏంటిరా ఇది, మన ఊరిలో ఇంత ఫ్యాక్షనిజమా? పట్టపగలు నడిరోడ్డు మీద ఒక మనిషిని గొడ్డళ్లతో నరికి చంపడం ఏమిటి!" నమ్మలేనట్టుగా అడిగాను.

'ఇదేం జూశావ్. మొన్న కాంగ్రెసోళ్లు టిడిపి నాయకుణ్ణి బాంబులేసి చంపారు. రెండో రోజు టిడిపి వాళ్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుణ్ని ఇనపరాడ్లతో కొట్టి చంపారు" నింపాదిగా చెప్పాడు శ్రీను.

" అన్యాయమైపోతున్నదల్లా పిల్లలే. స్కూలు గురించి పట్టించుకునేవాళ్లు లేకపోవడంతో వాళ్ల చదువులు దెబ్బతింటున్నాయి." విశ్లేషించాడు రమేష్. వాడిది శాఖమూరే అయినా పరిమి గురించి బాగా తెలుసు.

"అందుకే, మనమే ఏదో ఒకటి చెయ్యాలి." అన్నాను, శ్రీరాముడి విగ్రహం వెనుక పేరుకున్న బూజును చూస్తూ. " మనమేం చెయ్యగలం?" ఇద్దరూ ఏకకంఠంతో అడిగారు.

"ఓ సంస్థను ప్రారంభిద్దాం. చదువుకునే పిల్లలకు అవసరమైన సహకారం అందిద్దాం. నా ఫ్రెండ్స్ ద్వారా డబ్బు పోగుచేసే బాధ్యత నాది.

వింటున్నారు. వారిలో శ్రీను, రమేష్ కూడా ఉన్నారు.

అప్పటికి సంవత్సరం క్రితం జర్నలిస్టు ఉద్యోగం వీడి, హైదరాబాదులోని స్వచ్ఛంద సంస్థలో మేనేజర్‌గా చేరాను. ఆ సంస్థ తరపున ఈ శిబిరం ఏర్పాటు చేశాను.

రమేష్ లేచి, ఓ ప్రశ్న అడిగాడు. శాస్త్రవేత్త సంతోషంగా తల ఊపుతూ, రమేష్‌ను స్టేజీ మీదకు పిలిచి "ముందు , పత్తిసాగులో మీ అనుభవాలు చెప్పండి." అన్నారు.

రమేష్ గొంతు సవరించుకుని, మాట్లాడటం మొదలు పెట్టాడు. విత్తనాన్ని ఎంచుకోవడంలో ఎదురయ్యే ఇబ్బందుల దగ్గర్నుంచీ దళారుల కారణంగా ధర గిట్టుబాటు కాని వాస్తవం దాకా అనర్గళంగా మాట్లాడాడు. మధ్య మధ్యలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో కూడా అన్యాపదేశంగా వివరించాడు. ఇరవై నిమిషాల తర్వాత వాడు "ఏదో నోటికొచ్చిందల్లా మాట్లాడాను. తప్పులుంటే క్షమించండి." అని రెండు చేతులూ జోడించగానే కరతాళధ్వనులు మిన్నంటాయి.

అది మొదలు, మా సంస్థ తరుపున రాష్ట్రంలో ఎక్కడ రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించినా, రమేష్‌ను ప్రత్యేకంగా రప్పించేవాణ్ణి. వాడు సిసలైన వ్యవసాయ భాషలో రైతుల్ని కట్టిపడేసేవాడు.

పరిమిలో కార్యక్రమం ముగియగానే కోటయ్య అనే రైతు నా దగ్గరికొచ్చి.తనను తాను పరిచయం చేసుకున్నాడు.పెనుమాక గ్రామానికి చెందిన ఆయన కాకతాళీయంగా ఈ శిబిరానికి వచ్చాడట. ఇలాంటిది తమ గ్రామంలో కూడా నిర్వహించమని అడిగాడు. వారం తిరక్కుండానే పెనుమాకలో కార్యక్రమం ఏర్పాటు చేశాం. అది మధ్యాహ్నానికి ముగిసింది. భోజనం తర్వాత కోటయ్య నన్నూ మా బృందాన్నీ పొలాలకు తీసుకెళ్లాడు. విజయవాడకూ, కృష్ణానదికీ అత్యంత సమీపంలో ఉన్న పెనుమాక, ఒక ఆకుపచ్చని కలకు ప్రతిరూపం. ఎండ ఫెళ్లున కాస్తున్న మార్చి నెల చివరి వారంలో కూడా పచ్చని పంటలు కనువిందు చేస్తున్నాయి. ఉల్లి, అరటి, కూరగాయల సాగు ఎక్కువగా కనిపించింది. కోటయ్య ఎకరం పొలంలోని దొండచెట్లు విరగకాశాయి.

"దొండను పందిళ్ల మీద పాకిస్తారు కదా!" నేల మీదే తీగలు సాగిన చెట్ల నుంచి అవిరామంగా కాయలు కోస్తున్న కూలీల వంక చూస్తూ సందేహం వ్యక్తం చేశాను.

"అవును సారూ, ఇంతకు ముందు పందిళ్ల వేసేవాళ్లం. ఇపుడా అవసరం లేకుండానే నేలమీద కాస్తున్నాయి. మంచి దిగుబడి వస్తంది. విజయవాడ మార్కెట్టు దగ్గర కావడంతో రేటు బాగానే గిట్టుబాటయితాంది." సంతోషంగా చెప్పాడు. ఒక గోతాము నిండా దొండకాయలు పోసి, మా కారులో వేశాడు కోటయ్య.

2012 మే 23

పెదపరిమిలో శ్రీను పెద్ద కూతురి పెళ్లి సందర్భంగా అందరం కలిశాం. అప్పటికి నాకు బాగా స్థిరత్వం దొరికింది. మా పిలల్లు హైస్కూలు చదువుల్లో ఉన్నారు. రమేష్‌కు వ్యవసాయం బాగా కలిసొచ్చింది. అదును చూసి అవసరం గ్రహించేవాడు. తండ్రి నుంచి సంక్రమించిన అయిదెకరాలకు తోడు మరో మూడెకరాల భూమి కొన్నాడు. కొడుకునీ కూతుర్నీ ఇంజినీరింగ్ చదివిస్తున్నాడు. శ్రీను తనకున్న నాలుగెకరాలకు తోడు మరో నాలుగెకరాల కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసేవాడు. పెద్దమ్మాయి డిగ్రీ పూర్తి చేయగానే, పెళ్లి తలపెట్టాడు. ఆ అమ్మాయికి రెండెకరాలు అప్పగించాడు. రెండో కూతుర్ని సీఏ చదివిస్తున్నాడు. చిట్టీల ద్వారా పొదుపు చేసుకున్న సొమ్ముతో శ్రీను సలహా మీదటే నేనూ పరిమిలో రెండెకరాల పొలం కొనుక్కున్నాను.

2014 సెప్టెంబరు

మా ఊరికి అయిదు కిలోమీటర్ల దూరంలోని 'తుళ్లూరు'ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన రాజధానిగా ప్రభుత్వం ప్రకటించింది. రాత్రికి రాత్రి మా ఊరి భూములకు రెక్కలొచ్చాయి. పొలాలు కోట్లకు పడగలెత్తాయి. సగం ఇళ్లకు మరుగుదొడ్ల సౌకర్యం లేని మారుమూల గ్రామంలో రియల్ ఎస్టేట్ ఆఫీసులు వెలిశాయి. కార్లు క్యూ కట్టాయి. దళారుల్ని ఆకస్మిక అదృష్టం వరించింది. రాజధాని నిర్మాణానికి

తొలిదశలో 30 వేల ఎకరాల భూమిని సమీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాస్తుకు అనుకూలంగాలేని 'అవలక్షణం' కారణంగా మా ఊరిని మినహాయించారు. అయితే మా ఊరి పొలం సింహ భాగం తుళ్లూరు గ్రామపరిధిలో ఉంది. నాదీ, శ్రీనుదీ కూడా అక్కడే ఉంది. మా పొలం నెత్తిన "ల్యాండ్ పూలింగ్ కత్తి" వేలాడుతోంది.

దళారుల పుణ్యమాని నెల తిరక్కుండానే మా ఊరి బీడు భూమి కూడా ఎకరం కోటిన్నరకు చేరుకుంది. ఓ రోజు రమేష్ ఫోన్ చేసి నేను పొలం అమ్మాలనుకుంటున్నాను. నువ్వు కూడా ఇచ్చేస్తావా, మంచి బేరం వచ్చింది." అన్నాడు. "శ్రీను గాడేమంటున్నాడు?' ఆరా తీశాను.

"వాడా ....సెంటిమెంటల్ ఫూల్. ఆ మట్టిని అమ్ముకోలేనంటున్నాడు." చెప్పాడు హేళనగా నవ్వుతూ. "అయితే నేనూ ఫూల్‌నే." అన్నాను. వాడు ఫోన్ పెట్టేశాడు.

రమేష్ రెండెకరాల పొలం అమ్మాడు. మూడు కోట్ల రూపాయలతో మకాం గుంటూరుకు మార్చాడు. ఫైనాన్స్ వ్యాపారం ప్రారంభించాడు. ఖరీదైన మిత్రులు జత కలిశారు.

2015 ఫిబ్రవరి 27, శుక్రవారం

"రామీ, భూమిని ప్రభుత్వానికి అప్పగించక తప్పేట్టు లేదు.." ఫోన్‌లో చాలా నీరసంగా ఉంది శ్రీను గొంతు. "ఎందుకని? మీరంతా కలిసి అభ్యంతర పత్రం సమర్పించారుగా" అడిగాను.

"అధికారులు తెలివిగా బెదిరిస్తున్నారు. ఈ నెల 28 లోపు భూమిని అప్పగిస్తే మనకు ఎకరానికి పన్నెండొందల గజాల స్థలం కేటాయిస్తారట. అది భవిష్యత్తులో కోట్ల ఖరీదు చేస్తుందట. లేకపోతే భూ సేకరణలో భాగంగా బలవంతంగా లాగేసుకుని, తృణమో పణమో పరిహారంగా ఇస్తారట." బాధగా చెప్పాడు శ్రీను.

"మరి ఏం చెయ్యాలనుకుంటున్నావు?"

"ఇచ్చేదామ్‌రా. ఈ టెన్షన్ మనం భరించలేము. రాత్రికి బయల్దేరి వచ్చెయ్. నీది కూడా ఇచ్చేద్దువు గానీ."

"ఓకే శ్రీనూ. టికెట్ బుక్ చేసుకుంటాలే. ఇంకేంటి సంగతులు?"

"ఇంకో ముఖ్యమైన సంగతుందిరా, రమేష్ గురించి..."

"ఏమైంది రమేష్‌కు? రెండు చేతులా సంపాదిస్తున్నాడని విన్నాను."

"డబ్బు పాపిష్టిదిరా. వాడేదో ఇల్లీగల్ వ్యవహారాల్లో ఇరుక్కున్నాడట. వాడి భార్య నాకు వారం నుంచీ ఫోన్లు చేస్తోంది. ఓసారి మనిద్దరినీ తనింటికి రమ్మని బతిమాలుతోంది. రేపొస్తావుగా వెళ్లి పాపం ఆమె బాధేమిటో కనుక్కుందాం."

2015 ఫిబ్రవరి 28, శనివారం, ఉదయం పది గంటలు

> చెరువు దాటగానే, మెయిన్ రోడ్డు మీద పరిమి వైపు ఫర్లాంగు దూరం పోయాక, బైకును డొంకలోకి మళ్లించాడు శ్రీను. "ఇటెక్కడకిరా?" అడిగాను. పోగొట్టుకున్న పొలాన్ని చివరిచూపు చూద్దామని... అంటూ బైక్ స్టాండ్ వేశాడు. ఇద్దరం చేలోకి నడిచాం.పత్తిచేను చివరి దశలో ఉంది. ముసుం మధ్యలో నడుస్తుంటే, మొక్కలు ఎండుకట్టెల్లా గుచ్చుకుంటున్నాయి. ఒక్కసారిగా, పిచ్చిపట్టిన వాడిలా శ్రీను రయ్యిన పొలానికి అడ్డంగా పరుగెత్తాడు. కంగారుగా నేను కూడా పరుగెత్తుతూ వెళ్లాను. గట్టు దాకా వెళ్లి, అక్కడ కూలబడ్డాడు వాడు. నేను వెళ్లి పక్కనే కూచున్నాను, పత్తిగుల్లలు గీసుకుపోయి, వాడి చేతులు అక్కడక్కడా రక్తమోడుతున్నాయి.

తుళ్లూరులో ప్రత్యేక ప్రభుత్వ కార్యాలయం

జనంతో కిక్కిరిసిపోయింది. ప్రభుత్వాజ్ఞను శిరసా వహించి బుద్ధిగా భూమిని అప్పగించడానికి వచ్చిన మాలాంటి వాళ్ళు, ఇంకేవేవో పనులపై వచ్చినవాళ్లతో కీసరబాసరగా ఉంది. శ్రీనూ నేనూ భూమినివ్వడానికి సంసిద్ధత తెలుపుతున్నట్లు సంతకాలు పెట్టి బయటికొచ్చాం. శ్రీను మౌనంగా ఉన్నాడు. వాడి మొహంలో బాధ, పగిలిన పత్తిగుల్లలా స్పష్టంగా కనిపిస్తోంది. మెయిన్ రోడ్డు మీదకి చేరుకున్నాం. అక్కడ కొంతమంది రైతులు ధర్నా చేస్తున్నారు. భూ సమీకరణకు వ్యతిరేకంగా నినాదాలిస్తున్నారు. ఇంతలో ఓ టీవీ చానల్ రిపోర్టర్ వచ్చి, మైకును ఓ రైతు చేతికిచ్చి మాట్లాడమన్నాడు. తలకు కండువా, భుజాన పైపంచెతో, మాసిన గడ్డంతో మాట్లాడటానికి సిద్ధమైన కోటయ్యను వెంటనే పోల్చుకోలేకపోయాను. గుర్తిం చగానే దగ్గరగా వెళ్లి శ్రద్ధగా అతని మాటలు వినసాగాను.



"అసలేమనుకుంటున్నారు రైతుల గురించి? మట్టిని నమ్ముకుని మట్టిలోనే బతుకుతున్న వాళ్లం. ఆ మట్టిని లాగేసుకుంటే మాకేగాదు, జనానిగ్గూడ అన్నం ముద్ద దొరకదు. మూడు కార్లు పండే భూమి. మండు వేసవిలో గూడా మల్లెలు పండే భూమి. ఎకరం ఉండా దిగుల్లేకుండా సంసారాలు సాదుతున్నాం. పిల్లల్ని చదివించుకుంటున్నాం. పెళ్లిళ్ల చెయ్యగల్గుతున్నాం. ఎకరానికి రెండు లక్షల ఆదాయం వస్తుంది. ఇప్పుడు దాన్ని లాగేసుకుని ఏటా పాతిక వేలు ఇస్తామంటే, అది ఏ మూలకొచ్చేను? ఎవురి కడుపు నింపేను? నాలుగెకరాల్లోంచి రొండెకరాలిమ్మంటే అర్థముంది. ఉన్నది మొత్తం ధారదత్తం సెయ్యమంటున్నారు. పదెకరాల రైతు కూడా బికారిగా మారాల్సిందేనా?.."

పాతికపైగా గ్రామాల్లోని పంటపొలాలు సమస్తం రాజధాని నిర్మాణానికి ఇచ్చే యాల్సిందేనని సర్కారు ఆదేశం. "ఎకరం దొండ తోటసాగుకు ఏటా పదిహేను వందల మంది కూలీలు

పడతారు. ఈ ప్రాంతం నుంచి లారీలకు లారీలు కూరగాయలు మార్కెటుకు పోతున్నాయి. ఇంత మంది కూలీల కడుపులేం గావాలి? మీ దగ్గర రాజధాని పెట్టబట్టే మీ భూములకు రేట్లొచ్చాయని మంత్రులు బుకాయిస్తున్నారు. బోడి ఇప్పుడు పెరగడమేంది...మా భూములు ఎప్పుడో కోటి దాటాయి. అయినా రాజధాని నిర్మాణా నికి లచ్చ ఎకరాలు నిజంగా అవసరమా?" కోట య్య ఆవేశంగా ఇంకా మాట్లాడుతూనే ఉన్నాడు. అన్యమ నస్కంగానే అక్కణ్నుంచి కదిలాం, శ్రీను బైకు మీద. ముందుగా అనుకున్న ప్రకారం, పరిమి వెళ్లే దారి మధ్యలోనే చెరువు దగ్గర్నుంచి ఎడమవైపు ప్రయాణించి శాఖమూరు చేరుకున్నాం. "రండన్న య్యా !" ఆహ్వానించింది రమేష్ భార్య. నలభై నిండక ముందే శరీరం మీద ముసలితనం వాలినట్లు, నిస్సత్తువగా ఉందామె. మొహంలోని దిగుల్ని దాచుకోలేకపోతోంది. పైపై మాటలు పూర్తయ్యాక "రమేష్ రెండు మూడు రోజులకోసారైనా ఇంటికొస్తున్నాడా?" తీగ లాగాను. అమె ఒక్క పెట్టున ఏడ్చేసింది. మేం కంగారు పడ్డాం.

నేను కొంచెం దగ్గరగా వెళ్లి "ఊరుకోమ్మా, ప్లీజ్, ఊరుకో. నీ కష్టంలో మేం పాలు పంచుకుంటాం. ధైర్యంగా ఉండు." అన్నాను ఆమె స్థిమిత పడింది. "అదెవత్తో, టీవీ నటి అంట. అయన దాంతో ఉంటున్నాడు, ఊరంతా ఆ విషయం కథలు కథలుగా చెప్పుకొంటున్నారు. తల కొట్టేసిన ట్లయింది. నాకు...".

అప్పటికే అన్ని విషయాలూ శ్రీను చెప్పడంతో నేను పెద్దగా ఆశ్చర్యపోలేదు.

"నువ్వేం కంగారు పడకు. మేమిద్దరం రేపు గుంటూరు వెళ్లి, మందలిస్తాం. కొట్టో తిట్టో వాణ్ని ఆ రొంపిలోంచి బయటికి తీసుకొస్తాం." ధైర్యం చెప్పా ను.

"డబ్బు చాలా పాపిష్టిది అన్నయ్యా. పొలం మట్టి రూపంలో ఉండగా ఆయన దేవుడు. ఆది డబ్బు రూపంలోకి మారిందో లేదో మాయదారి రోగాలు పుట్టుకొచ్చాయి." రెండు వాక్యాల్లో రమేష్ జీవితాన్ని విశ్లేషించిందామె.

ఆమె దగ్గర సెలవు తీసుకుని బండి మీద బయల్దేరాం. చెరువు దాటగానే, మెయిన్ రోడ్డు మీద పరిమి వైపు ఫర్లాంగు దూరం పోయాక, బైకును డొంకలోకి మళ్లించాడు శ్రీను.

"ఇటెక్కడకిరా?" అడిగాను.

పోగొట్టుకున్న పొలాన్ని చివరిచూపు చూద్దామని... అంటూ బైక్ స్టాండ్ వేశాడు. ఇద్దరం చేలోకి నడిచాం. పత్తిచేను చివరి దశలో ఉంది. మునుం మధ్యలో నడుస్తుంటే, మొక్కలు ఎండుకట్టెల్లా గుచ్చుకుంటున్నాయి. ఒక్కసారిగా, పిచ్చిపట్టిన వాడిలా శ్రీను రయ్యిన పొలానికి అడ్డంగా పరుగెత్తాడు. కంగారుగా నేను కూడా పరుగెత్తుతూ వెళ్లాను. గట్టు దాకా వెళ్లి, అక్కడ కూలబడ్డాడు వాడు. నేను వెళ్లి పక్కనే కూచున్నాను, పత్తిగుల్లలు గీసుకుపోయి, వాడి చేతులు అక్కడక్కడా రక్తమోడుతున్నాయి. వాడు రొప్పుతున్నాడు. నేను సముదాయిస్తున్నట్టుగా, వాడి భుజం మీద చెయ్యి వేశాను. బావురుమన్నాడు.

"ఇక్కడే! ఇక్కడే రా... నేను అరక దున్నడం నేర్చుకుంది. గొర్రు తిప్పడం, విత్తనం ఎద బెట్టడం, కలుపు తియ్యడం,మందు చల్లడం... అన్నీ ఈ మట్టిలోనే నేర్చుకున్నాను. పత్తి, మిర్చి, మినుము, కంది, శనగ, జామ... ఎన్ని రకాల పంటలిచ్చిందో ఈ తల్లి. కేవలం ఈ నేల మీదనే సంసారం గడిచింది. పెద్దకూతురి పెళ్లి చేశాను. చిన్నదాన్ని సీఏ చదివిస్తున్నాను... ఇప్పుడు ఇచ్చేశాను. ప్రభుత్వానికి నా వంతు కానుకగా ఇచ్చేశాను. తల్లి వేరు తుంచుకున్నాను. మట్టి బంధం తెంచుకున్నాను. రేపట్నుంచి ఎలా బతకాలి? తెల్లారే లేచి, ఏ దిక్కుగా నడవాలి? నాగలిని ఏం చెయ్యాలి?" శ్రీను గుండెలవిసేలా విలపిస్తున్నాడు, పత్తిచెట్టును పొదివి పట్టుకుని. నాకు తెలియకుండానే, నా కళ్లు తడిదేరాయి. వాణ్ని ఓదార్చడానికి విఫలయత్నం చేశాను.ఏడ్చీ ఏడ్చీ సొమ్మసిల్లి పడిపోయాడు శ్రీను.

2015 మార్చి, అదివారం

నేను, శ్రీను ఉదయం తొమ్మిదింటికి పరిమిలో బయల్దేరి పదింటికి గుంటూరు చేరుకున్నాం. ఆటోలో నేరుగా రమేష్ ఫ్లాటు దగ్గరకు వెళ్లాం. అపార్టుమెంటు గ్రౌండ్‌ఫ్లోర్‌లోనే జనం మూగి ఉన్నారు. వాడు నాలుగో అంతస్తులో ఉంటాడు. లిఫ్ట్‌లో పైకి వెళ్లడానికి ప్రయత్నించగా, ఓ పోలీస్ అడ్డుకున్నాడు. అంతమంది జనం, నలుగురు కాన్‌స్టేబుళ్లు అక్కడెందుకున్నారో మాకర్థం కాలేదు. ఓ పక్కగా నిలబడి, వింతగా చూస్తున్నాం. ఇంతలో లిఫ్ట్ కిందికి వచ్చింది. అందులోంచి, ఇద్దరు పోలీసులు రమేష్‌కు చెరో పక్క నిలబడి బయటికొచ్చారు. తోసుకుంటున్న జనాన్ని తప్పించుకుంటూ, వాడి చెరో రెక్క పట్టుకుని చకచకా తీసుకెళ్లారు. అంత హడావుడిలోనూ గోడవారగా నిలబడి ఉన్న మా ఇద్దర్నీ రమేష్ ఓరకంట గమనించినా, చూడనట్లే ముందుకు సాగిపోయాడు. మాకంతా అయోమయంగా ఉంది. "ఏం జరిగింది?" అని జనంలోంచి అడిగిన ఓ వ్యక్తికి మరో వ్యక్తి చెబుతున్న సమాధానం మాకు స్పష్టంగా వినిపిస్తోంది.

"గంట క్రితం, బ్రాడీపేటలో ఉన్న లాడ్జిలో ఎవరో ఓ టీవీ నటిని హత్య చేశారట. ఆ హత్యతో ఇతనికి సంబంధం ఉండొచ్చన్న కారణంతో అరెస్టు చేసి తీసుకెళ్తున్నారు."

మాకిక అక్కడ ఉండ బుద్ధి కాలేదు. బీడువారిన హృదయాలతో భారంగా కదిలాం.

✦

కార్టూన్ కాలమ్

చుక్కలు కలపండి





బంగాళదుంపతో...

అడవి పంది

అడవి పంది తనను తాను రక్షించుకోవడానికి వీలుగా శరీరమంతా ముళ్లు ఉంటాయి. చూడ్డానికి భలే తమాషాగా వుంటుంది కదూ. అయితే అలాంటి బొమ్మను తయారు చేయడమెలాగో నేర్చుకుందాం!

కావలసిన వస్తువులు:

ఆలుగడ్డ, టూత్‌పిక్స్, గమ్, రబ్బరు బ్యాండ్లు.

తయారు చేసే విధానం:

ఎనిమిది టూత్‌పిక్కును తీసుకుని వాటిని సగానికి విరవండి. నాలుగు నాలుగు పుల్లలను కలిపి వాటి చివర ఒక రబ్బరు బ్యాండు పెట్టి ఉంచండి. ఇప్పుడు వాటిని కాళ్లలాగా ఆలుగడ్డకు గుచ్చుకోవాలి. స్కెచ్‌పెన్నుతో మొహం ఆకారాన్ని గీసుకోవాలి. టూత్‌పిక్స్‌ని ఆలుగడ్డ మీద గుచ్చాలి. అంతే! అడవి పంది బొమ్మ రెడీ.

మూడిటి బరువు ఎంత?

ఇక్కడ పిల్లి, కుక్క, కుందేలు వున్నాయి. వాటి బరువు ఎంతో కూడా ఇచ్చారు. అయితే మూడూ కలిపి ఎంత బరువు వున్నాయో చెప్పాలి? పిల్లి, కుందేలు 10 కేజీలు, కుందేలు, కుక్క: 20 కేజీలు. కుక్క, పిల్లి: 24 కేజీలు. కుందేలు, కుక్క, పిల్లి కలిపి ఎంత బరువుంటాయి?



జవాబు: మూడింటి బరువు ఎంతో చెప్పాలంటే...విడి విడిగా ఒక్కో జంతువు బరువు ఎంతో కనుక్కోవాలి. కుందేలు-3, పిల్లి-7, కుక్క-17 కేజీలు. మూడూ కలిపి: 27 కేజీలు. కావాలంటే రెండేసి జంతువులను కలిపి ఇచ్చిన బరువుతో సరిచూసుకోండి.

మొత్తం ఎందరు?

ఆర్టిస్టు అంకుల్ మీ ముందుకు ఓ చెట్టు బొమ్మ తీసుకొచ్చాడు. ప్రతి కొమ్మకు ఓ నాయకుడి బొమ్మ వుంది. ఇంతకీ ఈ చిత్రంలో ఎందరు నాయకులున్నారు? వారెవరు? చెప్పుకోండి చూద్దాం.



జవాబు: మొత్తం 10. గాంధీ, నెహ్రూ, ఇందిరాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి, సర్వేపల్లి రాధాకృష్ణన్, బాలగంగాధర్ తిలక్, రాజీవ్‌గాంధీ, వినోబాభావే, సుభాష్ చంద్రబోస్, రాజా రామ్ మోహన్ రాయ్,

పదాలు వెతుకుదాం

దాగుడు మూతల ఆటంటే మీకు బాగా ఇష్టం కదా. అందుకే మీ ముందుకు 23 పదాలు వచ్చాయి. అన్నీ అదిగో ఆ అక్షర సమూహంలో ఎంచక్కా దాక్కున్నాయి. వాటిని మీరు కనిపెట్టాలి. అడ్డంగా, నిలువుగా, వంకరగా...ఎలాగైనా వుండొచ్చు. కాకపోతే మీరే తెలివిగా వాటిని గుర్తించి సున్నా చుట్టాలి.

V B M
P I L U T C W
W O S I R I H Q O
E L K N I W I R E P D
S E D A I S Y H Y D P A A
T U R E G Y X O S A U F I
R E E T S N N Y N A N C F N Y
M G R H O D O D E N D R O N Z
W A T E R L I L Y T E E D I T
P P R M I T O S H L T I Z
Y O M I L A G U E I T L P
Z P R A N I C M O U H
E P C R R K U N B
F Y A A L M M
C M E

BUTTERCUP	IRIS	PRIMROSE
CARNATION	LILAC	RHODODENDRON
CHRYSANTHEMUM	LILY	ROSE
DAFFODIL	LOTUS	TULIP
DAISY	MARIGOLD	VIOLET
DANDELION	PEONY	WATER LILY
GERANIUM	PERIWINKLE	ZINNIA
HONEYSUCKLE	POPPY	

కోడి పుంజు వేద్దామా



ఏ దేశం జెండా ఏది?



ఇక్కడ 8 దేశాలు, వాటి జాతీయ జెండాలు ఇచ్చారు. ఇంతకీ ఏ దేశపు జెండా ఏదో గుర్తించి జత చేసేయండి

China ☐
United Kingdom ☐
Israel ☐
Thailand ☐
Brazil ☐
South Africa ☐
Mexico ☐
Canada ☐



వ్యాధులపై శాస్త్రీయ అవగాహన కల్పించే కథలు

నాకెందుకు ఈ రోగం వచ్చింది? దీన్ని నయం చేసుకోవడమెలా? ..జబ్బు పడిన మనిషి వేసుకునే ప్రశ్నలివి. వీటికి సమాధానం కోసం అతడు పడిన తపన మానవ జాతి చరిత్ర పొడవునా మనకు కనిపిస్తుంది. తనకు సమాధానం తెలియని అనేక విషయాలకు మాదిరిగానే ఆ వ్యాధులకు కూడా ఏ దేవుడో, దయ్యమో కారణం అనుకున్నాడు. ఆ దేవుడిని దయ్యాన్ని ప్రసన్నం చేసుకునేందుకు తనకు తోచిన రీతిలో ప్రయత్నించాడు. అంతటితో అతడు సరిపెట్టుకోలేదు. ఆలోచన తన నైజం అయిన మానవుడు ఈ జబ్బులకు కారణాలు అన్వేషించాడు. మూఢ నమ్మకాలను పెంచి పోషించిన మతాన్ని అధిగమించాడు. ఎందరో శాస్త్రవేత్తలు తమ జీవితాలను అంకితం చేసి అనేక ప్రాణాంతక వ్యాధులకు మందులు, చికిత్సలు కనిపెట్టారు. అయితే 21 వ శతాబ్దం వచ్చినా ఆనాటి మూఢ విశ్వాసాలు ఇంకా అంతరించిపోలేదు. ఈ ఆధునిక యుగంలో సైతం కొందరు మంత్రాలు తంత్రాలు అంటూ ప్రజల్లో అంధ విశ్వాసాలు వ్యాపింపజేస్తూనే ఉన్నారు. తమ పబ్బం గడుపుకునేందుకు వారు అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

'చక్కెర చినగుండయ్య' కథలో ఈ పుస్తక రచయిత పేర్కొన్నట్లు, వ్యాధి అనేది మనిషి పాపాలు చేసినందువల్లో, పూర్వజన్మ ఫలితంగానో వచ్చేది కాదు. చక్కెర వ్యాధి అంటే ఏమిటో, వైద్య శాస్త్రవేత్తలు దానికి ఎలా చికిత్స కనిపెట్టారో ఆర్. నటరాజన్ చక్కగా వివరించారు.అలాగే కరకాలుడి కథలో "మహా మూర్ఖ బేతాళుడా! రాను రాను నీ గుడ్డి నమ్మకాలకు అంతే లేకుండా పోతోంది" అంటూ , తల్లి గర్భంలో ఉండగా ఆవు తన్నడానికి, ఆమె కుమారుడు అవిటి వాడు కావటానికి సంబంధం లేదని, పోలియో జ్వరం సోకడం వల్లే కరకాలుడనే వాడు అలా అయ్యాడని విక్రమాదిత్యుడు పాత్రతో చెప్పిస్తాడు. ఈ కరకాలుడి కథలో పోలియో వ్యాధి గురించి , దానికి వ్యాక్సిన్ కనిపెట్టిన తీరు గురించి సవివరంగా ఉంది. ఇలాగే మరి కొన్ని వ్యాధులను,

విజ్ఞాన విక్రమాదిత్యుని కథలు,
తమిళ మూలం: ఆర్. నటరాజన్,
తెలుగు: ఎజి. యతి రాజులు,
వెల:45/-,
పేజీలు:90,
ప్రతులకు: ప్రజాశక్తి బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు.
ఫోన్: 27608107.



వాటికి మందులు కనిపెట్టిన వైనాన్ని భేతాళ కథల రూపంలో రచయిత ఆసక్తికరంగా తెలియజెప్పారు. 'వైద్య రంగ అద్భుతాల'తో కూడిన ఈ "విజ్ఞాన విక్రమాదిత్యుని కథలు" ఆయా వ్యాధులపై సమగ్రమైన శాస్త్రీయ అవగాహన కల్పిస్తాయి.

-స్నేహ

మానవీయ కోణావిష్కరణ

ఆకాశమంత (కథా సంపుటి),
రచయిత్రి: డా॥ శమంతకమణి,
పేజీలు: 200,
వెల: 150/-,
సి.డి:100/-,
ప్రతులకు: ప్రజాశక్తి బుక్ హౌస్.



'**ఆ**కాశమంత' కథాశ్రవణం సీడీని కూడా ఈ పుస్తకంతో అందించారు. ఇదో వినూత్న ప్రయత్నం. దాదాపు 30 కథలు ఈ సంపుటిలో ఉన్నాయి. అమ్మమ్మ, కథల పోటీ, అమ్మ అమ్మే, మాతృ న్యాయం, సంస్కృతి, ఆత్మ బంధువు, బంధం, నాశ్వాస నీవై, అపరాజిత, భారతీ నీ సేవకై, గూడు, ఆవిడ ఆవిడే, ఆ వేదన, ఒరేయ్ కన్నా, మౌన ఘోష, నవ వసంతం, సెల్ హెల్, చమేలీ, డైరీలో ఒక రోజు, తూనీగ మేలు కొలుపు, నిశ్శబ్ద రాగం, నో ఓవర్ టేకింగ్ ప్లీజ్!, సుదూరం, బజ్జో కన్నా, వీడ్కోలు..కథలను హాయిగా చదువుకోవచ్చు. ఈ కథల సీడీపై వచ్చే ఆదాయం 'అంధుల విద్యకై కేటాయించాలన్న రచయిత్రి సామాజిక స్పృహకు జేజేలు పలకాల్సిందే. 'వీడ్కోలు' కథాంశం భవిష్య కాలదర్శనం చేయించింది. 2050, 2051 సంవత్సరంలోకి పాఠకుల్ని తీసికెళ్ళారు. కథలో చివరి అంశం పాఠకుల్ని కన్నీరు పెట్టిస్తుంది. మీ నాన్నగారు 2.30 గంటలకు చనిపోయారు. నీవు, కోడలు మనవడితో కలిసిరాగలవా? సారీ అమ్మా ఖాళీ లేదు... ఇంకో సంవత్సరం వరకు మా క్యాలెండర్‌లో ఖాళీ లేదు. మాధవి భారతదేశం చూడాలని అంది. అందుకే 2051లో ఓ పదిరోజులు సెలవులో వస్తాం.. ఇలా సంభాషణలు. లలిత భర్త పరశురాం శరీరం మెడికల్ కాలేజీకి డిసెక్షన్‌కి వెళ్లిపోయింది. పనికొచ్చే అవయాలన్నీ తీసేసి అనారోగ్యంతో ఉన్నవారికి అమర్చేశారు. ప్లాస్టిక్ సర్జరీకి పనికొచ్చే విధంగా చర్మాన్ని రీ సైక్లింగ్ యూనిట్‌కి పంపించేశారు. (పేజీ 200). ఇది మానవ సంబంధాల ప్రస్తుత స్థితి. రేపటి స్థితికి అద్దం పడుతుంది. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే కదా!! 2, 3 అట్టమీద పేజీల్లో ఇచ్చిన మహిళామణుల ఫోటోలు ఈ పుస్తక విలువను పెంచాయి. అవయవ దానం ఆవశ్యకతను కుటుంబ నేపథ్యంలో చక్కగా చెప్పించి, మెప్పించిన కథ 'అమ్మమ్మ' కథ. అమ్మమ్మ చనిపోవడం ఆమె నేత్రాలను తన కూతురికి అమర్చిన డా॥ మాధవి కథ బాగుంది. మహిళా సాధికారిత, వ్యక్తిత్వం, ఆత్మ గౌరవం తొణికిసలాడే సన్నివేశాల బలంతో నడిచిన కథ 'అమ్మ అమ్మే'. వ్యవసాయం ప్రాధాన్యతను పరోక్షంగా ప్రోత్సహించిన కథ 'మాతృ న్యాయం'. నేటి సామాజిక విలువల దుస్థితిని తెలుపుతుంది. శరత్ సాహిత్య గుబాళింపుగా 'ఆత్మ బంధువు' కథను చెప్పుకోవచ్చు. మాధురి, ప్రశాంత్ వివాహం. .విడాకులు.. హైస్కూల్ సహాధ్యాయి శరత్ ప్రోత్సహంతో పి.హెచ్.డి చేసి యూనివర్శిటీలో ఉద్యోగం సంపాదించి తన కాళ్ళపై తాను నిలబడిన మాధురికి శరత్ నిజమైన ఆత్మ బంధువు, స్త్రీ, పురుష సంబంధాలకన్నా, ఆర్థిక సంబంధాల కన్నా, మానవ సంబంధాలే మిన్న అని నిరూపించిన కథాంశం ఇది. చాలా కథలు కుటుంబ నేపథ్యం, మాతృత్వ ప్రేమ చుట్టూ తిరుగుతాయి. లివింగ్ టు గెదర్ కల్చర్ రాజ్యమేలే కాలంలో మావనతా విలువలు... స్త్రీ సాధికారిత అంశాల ప్రాధాన్యత తెలిపే చక్కటి కథా సంపుటి ఇది.

- తంగిరాల చక్రవర్తి

కొమ్మ కొమ్మకో సన్నాయి,,,

ఈ చెట్టు జానపద సంగీత గాలుల్ని వీస్తుంది. కృత్రిమమైందే అయిన ఒడిశా సాంస్కృతిక సంపదకు జీవం పోస్తోంది. అంతరించిపోయిన, కాల గర్భంలో కలిసిపోతున్న అరుదైన సంగీత పరికరాలకు ఆలవాలమై వాటి గొప్ప చరిత్రను ప్రచారంలోకి తెచ్చింది. జానపద కళలకు ఆస్తులైన సంగీత పరికరాల్ని పరిరక్షించాలన్న ఒడిశాకు చెందిన రబీ రతన్ సాహు తపనే ఈ సంగీత 'వృక్ష రాజం'. సంబాల్‌పూరి జానపద నాట్య కళాకారుడైన సాహు భువనేశ్వర్, పాదంపూర్‌లో నాట్య తరగతుల్ని నిర్వహిస్తున్నాడు. జానపద నాట్యశైలికి ప్రాణమైన సంగీతానికి అవసరమైన పరికరాలు కనుమరుగవుతుండటంతో ఆయన కలత చెందాడు. జానపద నాట్యాలకు ఆయువు అయిన ఎన్నో సంగీత పరికరాలు అంతరించిపోతున్నాయని గ్రహించిన సాహు వాటిని కాపాడుకోవడానికి చేసిన కొత్త ఆలోచనే ఈ జానపద చెట్టు. ఒడిశా అంతా గాలించి అరుదైన సంగీత పరికరాల్ని సేకరించాడు. దుడుకి, ధుంకెల్, కెండార, బ్రహ్మ వీణ వంటి తంత్రి పరికరాల్ని, మహురీ, తోడి, సింగ వంటి వాయిద్యాలను, ఘంటి, కుబుజి, మంజీర, ఝూంజ్ వంటి లోహ పరికరాల్ని సేకరించాడు. వీటిని ఎక్కువగా గిరిజన, వనవాసులు ఉపయోగిస్తారు. బార్‌ఘడ్ జిల్లాకు చెందిన పురాతనమైన భలూ బన్సీ అనే వాయిద్యం జింక అరుపులాంటి శబ్దాన్ని సృష్టిస్తుంది. దాదాపుగా మరచిపోయిన మయూర్‌భంజ్‌కు చెందిన బనమ్ అనే తంత్రి పరికరం, మహిమ ధర్మకు చెందిన సన్యాసులు ఉపయోగించే ఖంజని వంటి సంగీత పరికరాల్ని అతి కష్టం మీద సేకరించగలిగాడు. సాంబర్ జింక కొమ్ము నుంచి తయారుచేసే సింగ వాయుద్య పరికరమైతే ఓ గిరిజన తెగ వద్ద ఒకటి మాత్రమే మిగిలి ఉంది. తన లక్ష్యాన్ని వివరించి వారిని పరివిధాల వేడుకుని దాన్ని వెలుగులోకి తేగలిగాడు. మూడేళ్లుగా అనేక ప్రదేశాల్లో గాలించి సేకరించిన నలభై పరికరాల్ని పొందిగ్గా అమర్చి సంగీత వృక్షాన్ని తయారుచేశాడు. ●

టైర్ పార్క్

‘పనికి రానివి ఇంట్లో ఎందుకంట. అడ్డం కాకపోతే. వాడేసిన వాటిని విసిరేయడమే ఉత్తమం’ అనుకునేవారే అందరూ. అందుకే వ్యర్థాలను వదిలించుకుంటుంటాం. అరిగిపోయిన టైర్లూ... పాడైపోయిన కంప్యూటర్లూ... ఆ కోవకు చెందినవే. కూసింత సృజనాత్మకత వుండాలేగానీ వాటికి సైతం మరో జన్మను ప్రసాదించవచ్చు. పరిసరాలను అందంగా మలచుకోవచ్చు. చూపరులను విస్మయపరచొచ్చు. అరిగిబద్దలైన కార్ల టైర్లను ఇదిగో ఇలా పార్కుల్లో ఆట వస్తువులుగా... అందమైన పూలకుండీలుగా మార్చేశారు. చిన్నారులు ఊగుతున్న ఊయలలు, కూర్చున్న బల్లలు, చూస్తున్న పూల కుండీలు, వింత జంతువులు, పక్షులు... అన్నీ టైర్లతో చేసినవే. టైరు కుండీల్లో బంతులు, చేమంతులు, గులాబీలు, క్రోటన్లే కాదు. టమోటాలు, పొటాటోలు, కొత్తిమీర, ఆకు కూరలు కూడా పెంచుకోవచ్చు. అందుకే అంటారు మనసుండాలేకానీ మార్గం వుంటుందీ అని.